3.5 లక్షల మంది తల్లులకు వందనం



ఎన్నికల హామీల్లో భాగమైన తల్లికి వందనం పథకాన్ని వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేసేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం 1.65 లక్షల మంది పిల్లలకు అమ్మ ఒడిని అమలు చేయగా.. కూటమి ప్రభుత్వంలో ఆ సంఖ్య రెట్టింపు కంటే ఎక్కువ కానుంది. 1,47,190 మంది ప్రభుత్వ, 1,55,784 మంది ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు.. 62,761 మంది ఇంటర్ విద్యార్థులు.. మొత్తంగా 3,65,735 మందికి రూ.15 వేలు చొప్పున 'తల్లికి వందనం' అందనుంది. వైసీపీ ప్రభుత్వం కుటుంబంలో పిల్లలందరికీ రూ.15 వేలు ఇస్తామని, అధికారంలోకి వచ్చాక రూ.13 వేలు చొప్పున ఇంట్లో ఒక్కరికే ఇచ్చింది. అలాగే 2023-24 విద్యా సంవత్సరానికైతే పూర్తిగా ఎగ్గొట్టేసింది.

గాలేరు-నగరి.. అంతంత మాత్రమే

గాలేరు-నగరి ప్రాజెక్టుకు నిధుల కేటాయింపు ఉసూరుమనిపించింది. 2024-25లో వైసీపీ ప్రభుత్వం రూ.2438.95 కోట్లు కేటాయించగా.. విడుదల చేసింది రూ.373.58 కోట్లు మాత్రమే. కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.488.57 కోట్లు కేటాయించింది. వాస్తవానికి గాలేరు-నగరి ప్రాజెక్టు కడప జిల్లాలో పెండింగ్ పనులు పూర్తి చేయడానికే కనీసం రూ.1400 కోట్లు అవసరం. గండికోట ప్రాజెక్టు నుంచి తిరుపతి జిల్లాకు ప్రతిపాదించిన ప్రత్యామ్నాయ డిజైన్ పనులకు మూడేళ్ల కిందటే రూ.5 వేల కోట్లు అవసరమని అంచనా వేశారు. ఇప్పుడి రూ.6 వేల కోట్లకు చేరి ఉంటుంది. కొత్త బడ్జెట్‌లో కేటాయించిన నిధులు కడప జిల్లాలో పెండింగు పనులకే చాలవు.



'గంగ'కు పెంచినా.. అరకొరే

తెలుగుగంగ ప్రాజెక్టు పరిస్థితి కూడా అలానే వుంది. ఈ ప్రాజెక్టుకు గత వైసీపీ ప్రభుత్వం 2024-25లో రూ. 453.18 కోట్లు కేటాయించింది. కేవలం రూ.150 కోట్లు మాత్రమే విడుదల చేసింది. ప్రస్తుత ప్రభుత్వం రూ.345.48 కోట్లు కేటాయించింది. కండలేరు ప్రాజెక్టు మొదలుకుని, స్వర్ణముఖి బ్యారేజీ, సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్, తెలుగు గంగ కాలువలు, తిరుపతికి తాగునీటి సరఫరా వరకూ పలు అంశాలు తెలుగు గంగ ప్రాజెక్టుపై ఆధారపడి ఉన్నాయి. తెలుగు గంగ కాలువలు పలుచోట్ల అసంపూర్తిగా వున్నాయి. గతంతో పోలిస్తే తెలుగు గంగకు రూ.200 కోట్లు ఎక్కువ ఇచ్చినా.. అవసరాల దృష్ట్యా ఈ కేటాయింపులు సరిపోవనే చెప్పాలి. ఈ నిధుల్లోనే ఎస్ఎస్ లింక్ కెనాల్‌కు రూ.69 కోట్లు కేటాయించాలి. అయితే గతేడాది వైసీపీ ప్రభుత్వం కేటాయించిన రూ.49 కోట్లతో పోలిస్తే రూ.20 కోట్లు అదనంగా ఇవ్వడం ఊరటనిచ్చే అంశం. స్వర్ణముఖి బ్యారేజీ అభివృద్ధికి నిధుల కేటాయింపు జరగకపోవడం గమనార్హం.



బడ్జెట్‌పై ప్రముఖుల అభిప్రాయాలు - 8లో

చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం సమర్పించిన తొలి బడ్జెట్‌లో తిరుపతి జిల్లాకు ఘనమైన వాటా లభించింది. జగన్ జమానాలో చతికిలబడ్డ అభివృద్ధి మళ్లీ పరుగులు తీయనుంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలు మీద 2025-26 బడ్జెట్ అధిక దృష్టి పెట్టడంతో జిల్లా పేద ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం పెరిగింది. నీటి ప్రాజెక్టులకు గత వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన నిధుల మొత్తానికన్నా ఎక్కువ కేటాయించినా.. అవసరాలకు సరిపడేలా లేవు. వర్సిటీలకు నిధుల కేటాయింపులు కూడా ఆశాజనకంగా లేదు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఇక పరుగులే!

అభివృద్ధి, సంక్షేమం సమతూకం



3647 మంది మత్స్యకారులకు రెట్టింపు లబ్ధి

చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అందించే ఆర్థిక సాయాన్ని కూటమి ప్రభుత్వం రూ.10 వేల నుంచీ రూ.20 వేలకు పెంచింది. తడ మండలంలో 1613 మంది, వాకాడులో 1045, చిల్లకూరులో 813, కోటలో 176 మంది చొప్పున 3647 మంది మత్స్యకారులున్నారు. వీరికి గత వైసీపీ ప్రభుత్వంలో రూ.10 వేల చొప్పున అందగా.. ఇప్పుడు రెట్టింపు లబ్ధి చేకూరనుంది.

వర్సిటీలు టాప్ 100లో నిలిచేదెలా?

ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ వంద యూనివర్సిటీలలో ఏపీ వర్సిటీలు ఉండేలా అభివృద్ధి పరుస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆ ప్రకటనకు తగ్గట్టుగా జిల్లాలో వర్సిటీలకు నిధుల కేటాయింపు జరగలేదు. పద్మావతీ మహిళా వర్సిటీకి గతేడాది వైసీపీ ప్రభుత్వం రూ.72.33 కోట్లు కేటాయించగా.. కూటమి ప్రభుత్వం రూ. 67.22 కోట్లు కేటాయించింది. శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ వర్సిటీకి గతేడాది బడ్జెట్‌లో రూ.168 కోట్లు కేటాయించింది అప్పటి ప్రభుత్వం. అందులో రూ.113 కోట్లు జీతాలకు, రూ.40 కోట్లు కంటింజెన్సీ కింద ఇవ్వగా రూ. 15 కోట్లు సివిల్ వర్కులకు కేటాయించారు. ఇప్పుడు రూ.165 కోట్లు కేటాయించింది. ఉద్యోగుల జీతాలు, కంటెన్జెన్సీ నిధులు రూ.154కోట్లు, సివిల్ పనులకు 11కోట్లు కేటాయించారు. ఇక, ఎస్వీయూకు గతేడాది వైసీపీ ప్రభుత్వం రూ.226.38 కోట్లు కేటాయించగా.. ఇప్పుడూ అదే మొత్తాన్నీ ఇచ్చారు. విశ్వవిద్యాలయాలకు ఏటా బడ్జెట్ కేటాయింపుల్లో కనీసం పదిశాతం పెరుగుదల ఉంటేనే వర్సిటీల సాధారణ నిర్వహణ సాధ్యం కాని పరిస్థితి. ఈ కేటాయింపులతో గ్లోబల్ టాప్ 100 వర్సిటీల జాబితాలో చేరడం ఎలా సాధ్యమన్న ప్రశ్న వినిపిస్తోంది.

శ్రీసిటీ ఐఐటీకి రూ. 19.52 కోట్లు

సత్యవేడు నియోజకవర్గం శ్రీసిటీ పరిధిలో ఏర్పాటు చేస్తున్న ఐఐటీకి ప్రభుత్వం రూ.19.52 కోట్లు కేటాయించింది. ఐఐటీ నిర్మాణానికి, ఇతర అవసరాలకు గతేడాది బడ్జెట్‌లో రూ. 39.04 కోట్లు కేటాయించగా నూతన బడ్జెట్‌లో రూ. 19.52 కోట్లు కేటాయించారు.



పెళ్లి సందడి

- ఆది దంపతుల కల్యాణోత్సవానికి సర్వం సిద్ధం
- జనంతో కిక్కిరిసిన మాడ వీధులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారుజామున జరిగే శివపార్వతుల కల్యాణోత్సవానికి శుక్రవారం రాత్రి నుంచే సందడి మొదలైంది. పెళ్లితంతు జరిగే శ్రీకాళహస్తిలోని కైకాలవారి పెండ్లిమండపం.. విద్యుద్దీప కాంతులతో వెలిగిపోతోంది. రంగవల్లులు.. మామిడి తోరణాలు.. అరటి చెట్లతో అలంకరించారు. ఎక్కడా లేనివిధంగా దేవుళ్లు ఆలయాన్ని వదిలి ఊర్లోకి వచ్చి వివాహం చేసుకోవడం శ్రీకాళహస్తి ప్రత్యేకత. ఈ కల్యాణోత్సవానికి వందల సంవత్సరాలుగా శాశ్వత ఉభయదారులుగా కైకాల వంశస్తులు ఉంటున్నారు. ఈ వంశానికి చెందిన చెంబేడుతో పాటు 14 గ్రామాల ప్రజలు.. తమిళనాడులోని పలు గ్రామాలకు చెందిన ఆ వంశస్తులు ఉభయదారులుగా వ్యవహరిస్తున్నారు. ఈ కల్యాణోత్సవాన్ని చూసేందుకు వచ్చిన భక్తులతో సాయంత్రం నుంచే మాడవీధుల్లో సందడి నెలకొంది. ఇదే కల్యాణ ఘడియలో వివాహం చేసుకునేందుకు పలు జంటలు తరలివచ్చాయి. నెహ్రూవీధి, నగరి వీధిలో భక్తులు, పెళ్లిబృందాలు విడిది చేయడానికి బారికేడ్లను ఆదిదంపతుల కల్యాణంలో బాల్యవివాహాలు జరగకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో నిఘా పెట్టారు. మరోవైపు పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచీ వచ్చిన భక్తులతో మాడవీధుల్లో సందడి నెలకొంది. ఇక, శుక్రవారం రాత్రి పరమశివుడు, జ్ఞానప్రసూనాంబ ఉత్సవర్లను స్వర్ణాభరణాలతో అలంకరించారు. టీటీడీ అందజేసిన పట్టువస్త్రాలను ధరించి శ్రీకాళహస్తీశ్వరుడు గజవాహనంపై.. జ్ఞానప్రసూనాంబదేవి సింహవాహనం అధిరోహించి పెండ్లిమండపానికి బయలుదేరారు. పరివారం ముందు నడుస్తుండగా.. పెండ్లి మండపానికి కదిలిన స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు.

> **వధూవరులు:** శివ పార్వతులు
> **ముహూర్తం:** శనివారం తెల్లవారుజామున 3 గంటలు
> **వేదిక:** శ్రీకాళహస్తిలోని కైకాలవారి పెండ్లిమండపం



శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత ఆలయం నుంచి గజ, సింహ వాహనాలపై పెండ్లి మండపానికి బయలుదేరిన శ్రీకాళహస్తీశ్వరుడు.. జ్ఞానప్రసూనాంబదేవి









ముస్తాబైన పెండ్లిమండపం - భక్తుల కోసం ఏర్పాటు చేసిన బ్యారికేడు - మాడవీధిలో జనం

చంద్రగిరి పంచాయతీ

కార్యదర్శిపై ఆరోపణలెన్నో?

- రూ.50 వేల లంచం తీసుకొంటూ ఏసీబీకి చిక్కిన మహేశ్వరయ్య



చంద్రగిరి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఏసీబీకి చిక్కిన చంద్రగిరి పంచాయతీ కార్యదర్శి మహేశ్వరయ్యపై గతంలోనూ ఎన్నో అవినీతి ఆరోపణలున్నాయి. రూ.6 లక్షల బిల్లుల మంజూరుకు రూ.50 వేల లంచం తీసుకుంటూ శుక్రవారం పట్టుబడిన ఈయన.. గతంలో పడమటి మండలాల్లో పనిచేశారు. 2022 జూన్‌లో కుప్పం నుంచి బదిలీపై చంద్రగిరికి వచ్చారు. అప్పట్లోనే చంద్రగిరి ఇందిరమ్మ కాలనీ భూకబ్జాదారులకు అక్రమంగా ఎన్‌వోసీలు ఇవ్వడం, ఇంటి ప్లానింగ్ అప్రూవల్ ఇవ్వడం.. వంటి ఘటనల్లో ఈయనపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. కూటమి అధికారంలోకి రాగానే బదిలీపై వెళతారనే ప్రచారం జరిగింది. అయినా, తన పలుకుబడితో ఇక్కడే కొనసాగుతున్నారు. తిరుచానూరుకు వెళ్లాలనే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఉపాధి హామీ పథకం బిల్లులకు సంబంధించి ఏసీబీకి చిక్కారు. చిన్నగొట్టిగల్లు మండలం పాలెం గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ దినేష్‌రెడ్డి.. గత ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకం కింద చంద్రగిరి పంచాయతీలో సచివాలయం, వెల్‌నెస్ సెంటర్ భవనాలను నిర్మించారు. గత నెలలోనే ఈయనకు రూ.6 లక్షల బిల్లులు మంజూరయ్యాయి. దీనికి పంచాయతీ కార్యదర్శి మహేశ్వరయ్య రూ.50 వేలు డిమాండు చేశాడు. దీనిపై ఆయన ఏసీబీ అధికారులను సంప్రదించారు. శుక్రవారం దినేష్‌రెడ్డి నుంచి కార్యదర్శి రూ.50 వేలు తీసుకొంటుండగా ఏసీబీ ఏఎస్పీ విమల కుమారి, డీఎస్పీ ప్రశాంతి, సీఐ మల్లికార్జున, సిబ్బంది రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆయన్ను అరెస్ట్ చేసి, నెల్లూరులోని ఏసీబీ స్పెషల్ కోర్టులో హాజరుపరచగా రిమాండు విధించారు.



పంచాయతీ కార్యాలయంలో ఏసీబీ అధికారులు

ఏసీబీ దూకుడు

- 28 రోజుల్లో మూడు కేసులు
- నలుగురు అధికారుల అరెస్టు

తిరుపతి ప్రాంతీయ అవినీతి నిరోధక శాఖ అధికారులు దూకుడు పెంచారు. 28 రోజుల వ్యవధిలో మూడు కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో నలుగురు అధికారులను నిఘావేసి పట్టుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అవినీతికి పాల్పడిన అధికారుల పట్ల ఉదాసీనంగా వ్యవహరించేవారు. నేతలకు అనుగుణంగా ఉంటే చాలు.. ఎన్ని ఫిర్యాదులు వెళ్లినా.. ఏమీ కాదన్న భావన ఉండేది. అప్పట్లో వాళ్లంతా ఇష్టారాజ్యంగా వ్యవహరించేవారు. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చినా... కొందరు అధికారులు అదే పంథాను కొనసాగిస్తున్నారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో అవినీతి నిరోధక శాఖ అధికారులు దూకుడు పెంచారు. అంచాలు డిమాండ్ చేయడం.. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టడం వంటి ఫిర్యాదులపై దృష్టి పెట్టారు. ప్రజల్లోనూ అవగాహన కల్పిస్తున్నారు. మదనపల్లె మాజీ ఆర్డీవో మురళి ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై ఏసీబీ జాయింట్ డైరెక్టర్ నేతృత్వంలో తిరుపతి ఏఎస్పీ విమలకుమారి, సిబ్బంది కలిసి గతేడాది నవంబరు 8న పలుచోట్ల ఏక కాలంలో సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో అత్యంత విలువైన డాక్యుమెంట్లు, నగదు, నగలు, కీలక పత్రాలు, వివిధ లావాదేవీలకు సంబంధించిన పాసు పుస్తకాలు సీజ్ చేశారు. ఈ కేసులో ఆర్డీవో మురళిని అరెస్టు చేశారు. ఇలా ఫిర్యాదులపై స్పందిస్తున్నారు. కాగా, ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని రిజిస్ట్రేషన్, రెవెన్యూ, మున్సిపల్, ఆర్డీవో కార్యాలయాల నుంచి ఏసీబీకి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నట్లు సమాచారం. తిరుపతి కార్పొరేషన్‌లోని ప్రణాళికా విభాగంలో నలుగురిపై కొందరు బాధితులు ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. వీటిపైనా ఏసీబీ దృష్టి పెట్టినట్లు సమాచారం.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

- జనవరి 30న మదనపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నిందితుడితో చేతులు కలిపి లారీనీ కేసు నుంచి తప్పించి విడిపించడానికిగాను రామసముద్రం ఎస్ఐ వెంకటసుబ్బయ్య, మదనపల్లె రెండవ పట్టణ సీఐ రమేష్ కలిసి రూ.70,000 లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. వారిద్దరిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు.
- ఫిబ్రవరి 25న రాయచోటిలో పనిచేస్తున్న చేనేత, జౌళి శాఖ అధికారి కృష్ణ చేనేత కార్మికుల నుంచి రూ 70,000 లంచం తీసుకుంటుండగా తిరుపతి ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు.
- తాజాగా చంద్రగిరి పంచాయతీ ఈవో మహేశ్వరయ్య కాంట్రాక్టరు నుంచి రూ.50 వేలు తీసుకుంటుండగా పట్టుకున్నారు.

నేటినుంచి ఇంటర్ పరీక్షలు

- రాయనున్న 62,761 విద్యార్థులు
- 86 కేంద్రాల్లో ఏర్పాట్లు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 20వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగనున్నాయి. 32,213 మంది ప్రథమ, 30,548 మంది ద్వితీయ సంవత్సర విద్యార్థులు మొత్తం 62,761 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందుకుగాను జిల్లా వ్యాప్తంగా 86 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పర్యవేక్షణలో ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి ఏర్పాట్లు పూర్తి చేశారు. 1,400 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సమస్యాత్మకమైన పిచ్చాటూరు, నాగలాపురం పరీక్ష కేంద్రాల్లో భద్రతను పటిష్టం చేశారు. స్పెషల్ ఆఫీసర్‌తోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్లు 4, సిట్టింగ్ స్క్వాడ్లు 8, డిపార్ట్‌మెంటల్ అధికారులు 86 మంది, చీఫ్ సూపరింటెండెంట్లు 86 మంది, కస్టోడియన్లుగా 20 మందిని నియమించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. విద్యార్థుల సహాయార్థం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఫిర్యాదులు, సహాయం కోసం 0877 2237200లో కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చు. నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించరాదనే నిబంధన ఉందని, దీన్ని గుర్తించి విద్యార్థులు జాగ్రత్త వహించాలని ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు.

ప్రిన్సిపాల్ మోహిద్దీన్ బాషాకు సన్మానం



పాకాల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.మోహిద్దీన్ బాషాను అధ్యాపకులు, ఆత్మీయులు, పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఆయన ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యాపకుడిగా, ప్రిన్సిపాల్‌గా ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. పదేళ్లుగా పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని అభినందించారు. శాలువాలు కప్పి, పూలమాలలు వేసి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సత్తార్‌సాహీర్, డాక్టర్ దామోదరనాయుడు, డాక్టర్ రాజేంద్రరెడ్డి, ఎఆర్ చంద్రశేఖర్, డాక్టర్ ఎన్‌సి రామచంద్రారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రమేష్‌కుమార్ , విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్ల దినోత్సవం



పాకాలలో ప్రదర్శన నిర్వహిస్తున్న టైలర్లు

పాకాల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): శ్రీ చైతన్య టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం టైలర్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు ర్యాలీ చేపట్టారు. ఆస్పత్రిలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో సమస్యలపై చర్చించారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య టైలర్స్ అసోసియేషన్ అధ్య క్షుడు ఎ.వేణుబాబు, ఉపాధ్యక్షుడు అబ్దుల్ రజాక్, కార్యదర్శి శేఖర్‌రెడ్డి, ట్రెజరర్ హబీబ్, సహాయ కార్యదర్శి త్యాగరాజులు, గౌరవాధ్యక్షులు చంద్ర, వేణుగోపాల్, సుబ్రమణ్యం రెడ్డి, సీఐటీయూ నాయకుడు మధుసూదన్ రావ్ పాల్గొన్నారు.

హెచ్‌ఎం ఖాదర్‌బాషాకు ఆత్మీయ సన్మానం



పాకాల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తురకపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఖాదర్‌బాషాను మండలంలోని ఉపాధ్యాయులు, మిత్రులు, ఆత్మీయులు ఘనంగా సన్మానించారు. స్థానిక ఎస్వీఎన్ పాఠశాలలో ఎంఈవో బాబ్జీ అధ్యక్షతన శుక్రవారం ఉద్యోగ విరమణ సభ నిర్వహించారు. ఉపాధ్యాయుడుగా విద్యా రంగానికి ఆయన చేసిన సేవలను, తురకపల్లె పాఠశాల అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. ఉపాధ్యాయులు, బాల్యమిత్రులు ఆయనను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఎంఈవో-2 లింగయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ శాస్త్రవేత్తగా ఎదగాలి



సైన్స్ నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

భాకరాపేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థీ ఒక శాస్త్రవేత్తగా ఎదగాలని గీతాంజలి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గిరికుమార్ రెడ్డి అన్నారు. పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహిం చారు. విద్యార్థులు వివిధ రకాల సైన్స్ నమూనాలు తయారు చేసి ప్రదర్శించారు. వాటి గురించి సందర్శకులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని, ఆ మార్పులకు అనుగుణంగా తమ మేథస్సును పెంచుకోవాలని విద్యా ర్థులకు సూచించారు. విద్యార్థులు తమ భవిష్యత్తును ఉపయోగపడే టెక్నాలజీని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం స్వాతి, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓపెన్ ఇంటర్ పరీక్షలు

● 3 నుంచి 15 వరకు 14 కేంద్రాల్లో నిర్వహణ



విద్యాశాఖాధికారులతో సమావేశమైన డీఈఓ

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఎటువంటి అవతకతవకలూ లేకుండా ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ కేవీఎన్ కుమార్ పాఠశాల విద్యాశాఖాధికారులను ఆదేశించారు. ఈ నెల 3నుంచి 15వ తేదీ వరకు ఓపెన్ ఇంటర్ పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో శనివారం ఆయన కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో సమావేశమయ్యారు. డీఈఓ మాట్లాడుతూ జిల్లాలో పరీక్షలు జరుగనున్న 14 పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. 2,838 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, వారిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్ష హాలులోకి అనుమతించాలని ఆదేశించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని చెప్పారు.

పాఠశాలల్లో ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు



పాకాల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేసిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు

పాకాల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ఉత్సాహంగా వివిధ నమూనాలు రూపొందించి ప్రదర్శించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అత్యుత్తమ నమూనాలు ప్రదర్శించిన విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్ కుప్పస్వామి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు బాబ్జీ, లింగయ్య, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కేఎన్ తులసీరామన్, ప్రతినిధులు ఆర్వీ ప్రసాద్, జయరామనాయుడు, రామయ్య, ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ మునిప్రభాకర్, నారాయణ స్వామి, ప్రధానోపాధ్యాయుడు జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటిలో ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు

చంద్రగిరి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తొండవాడ స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. మహా శివరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆలయంలో శుక్రవారం ఉదయం 6 గంటలకు స్వామికి రుద్రాభిషేకం నిర్వహించి, ఆనందవల్లీదేవికి అభిషేకం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. 7.30 గంటలకు పార్వతీపరమేశ్వర్ల ఉత్సవర్లను విశేషంగా అలంకరించి రావణాసుర వాహనంపై అధిష్ఠింపజేసి ఆలయ ప్రదక్షిణ గావించారు. 9 గంటలకు కాలభైరవ స్వామికి అభిషేకం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 7 గంటలకు శయనోత్సవం, ఊంజల్ సేవ జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మృత్యుంజయహోమంతో ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు



ప్రత్యేకాలంకారంలో కోటి లింగేశ్వరస్వామి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కోటిలింగేశ్వర స్వామి ఆలయ శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన మృత్యుంజయ హోమంతో ఉత్సవాలు ముగిశాయి. ఉదయం కోటిలింగేశ్వరస్వామి, కామాక్షమ్మ అమ్మవార్లకు తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. 10గంటలకు వేదపండితులు యాగశాలలో శాస్త్రోక్తంగా మృత్యుంజయ హోమం నిర్వహించారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తుల ఊరేగింపు జరిగింది. ఈ కార్యక్రమాల్లో విశ్రాంత ఆదాయపు పన్ను కమిషనర్ ఏసీ.నాయుడు, టీటీడీ విశ్రాంత ఉద్యోగి కఠారి భాస్కర్ నాయుడు, ఆలయ నిర్వాహకులు మురళీకృష్ణ, అబ్బూరి దేవరాజులు నాయుడు, హరి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పాకాల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పాకాల- నేంద్రగుంట రోడ్డు ఇన్‌ఫెంట్ జీసస్ పాఠశాల సమీపంలో రోడ్డు పక్కన ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి సుమారు 65 సంవత్సరాల వయస్సు ఉంటుంది. మ్యాంగోకలర్ టీషర్టు ధరించి ఉన్నాడు. యాచకుడని భావించి పోలీసులు పంచాయతీ సిబ్బందితో అంత్యక్రియలు పూర్తిచేయించారు.

పరీక్షా సామగ్రి పంపిణీ

భాకరాపేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు, భాకరాపేట జడ్పీ ఉన్నత పాఠశాలల్లోని 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షా సామగ్రిని వైసీపీ విద్యార్థి విభాగం అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో సర్పంచులు భూపాల్, మనోహర, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వేడుకగా కల్యాణోత్సవం



తిరుచానూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు యోగిమల్లవరంలో కొలువైన కామాక్షాంబ సమేతపరాశరేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం అత్యంత వేడుకగా కల్యాణోత్సవం జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నాలుగు రోజులుగా జరిగిన మహాశివరాత్రి వేడుకలు ముగిశాయి.

తిరుచ్చిపై పద్మావతి అభయం

తిరుచానూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారికి శుక్రవారం రాత్రి అత్యంత వేడుకగా తిరువీధి ఉత్సవం జరిగింది. ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి మూలమూర్తికి నేత్రపర్వంగా అర్చకులు అభిషేకం నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లకు కల్యాణోత్సవం జరిగింది. మధ్యాహ్నం ఉత్సవర్లకు వేడుకగా తిరు మంజనం జరిపించారు. సర్వ అలంకార శోభితురాలైన అమ్మవారు తిరుచ్చిపై కొలువుదీరి తిరు మాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు, చలపతి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ టీచర్‌కు సన్మానం



టీచర్ జయరామిరెడ్డిని సన్మానిస్తున్న ఎంఈవోలు

ఎర్రావారిపాళెం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పచ్చారవాండ్ల పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన జయరామి రెడ్డిని శుక్రవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఎంఈవోలు బాలసుబ్రమణ్యం, సతీష్ బాబు ఆయన సేవలను కొనియాడారు. ఆయన శేషజీవితం ప్రశాంతంగా సాగాలని ఆకాం క్షించారు హెచ్‌ఎం కృష్ణయ్య, ఉపాధ్యాయులు కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, మధుసూదన్, భాస్కర్‌యాదవ్, మల్లీశ్వర్, సిద్ధయ్య, చెంగల్‌రాయఅచారి, వెంకటరత్నం, సురేష్ పాల్గొన్నారు.

పార్కుల్లో పరికరాలకు మరమ్మతులు చేయించండి

తిరుపతి, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి) : నగరంలోని పార్కుల్లో మరమ్మతులకు గురైన పరికరాలను సరిచేయాలని, మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేస్తున్న మల్టీ ఫెసిలిటీ సెంటర్ నిర్మాణ పనులను, జగజ్జీవన్ రామ్ పార్కును అధికారులతో కలసి ఆమె పరిశీలించారు. పార్కులో వాకర్స్‌తో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పాడైన ఆట వస్తువులు, ఓపెన్ జిమ్ పరికరాలు మరమ్మతులు చేయాలన్నారు. మరుగుదొడ్లు, వాకింగ్ ట్రాక్ శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. మల్టీ లెవెల్ స్పోర్ట్స్ ఫెసిలిటీ సెంటర్ నిర్మాణ పనులు ఆలస్యం కావడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. అన్నమయ్య కూడలి వద్ద మరుగుదొడ్లను పరిశీలించారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, తుడా ఈఈ రవీంద్ర, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, డీఈలు రాజు, మధు, మహేష్, రమణ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

భాకరాపేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ నాగరాణి తెలిపారు. చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో చిన్నగొట్టిగల్లు, భాకరాపేట, ఎర్రావారిపాళెం మోడల్ కళాశాల, నెరబైలు జూనియర్ కళాశాల, కేజీబీవీ కళాశాల విద్యార్థులు మొదటి సంవత్సరం 260 మంది, రెండవ సంవత్సరం 192 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. నిమిషం ఆలస్యం అయినా అనుమతి లేదన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి : కలెక్టర్



ఎగ్జిబిట్స్‌ని సందర్శిస్తున్న కలెక్టర్, వివరిస్తున్న విద్యార్థులు

ఏర్పేడు/తిరుపతిరూరల్, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుకుని శాస్త్ర వేత్తలుగా ఎదగాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. ఏర్పేడు మండలం శ్రీనివాసపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐసర్)లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతికరంగాల్లో దేశాన్ని పురోభివృద్ధి దిశగా నడిపించడంలో శాస్త్రవేత్తలు చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. ఐసర్‌కి చెందిన విద్యార్థులు దాదాపు 100కిపైగా సరికొత్త విజ్ఞాన నమూనాలను రూపొందించి ప్రదర్శించారు. ఏర్పేడు, తిరుపతి, కాళహస్తి, శ్రీసిటీ వంటి ప్రాంతాల నుంచి దాదాపు 800మందికిపైగా విద్యార్థులు పాల్గొని సైన్స్ మోడల్స్‌ని ఆసక్తిగా తిలకించారు. అంతేగాక వారు రూపొందించిన నమూనాలను సైతం ప్రదర్శించారు. క్వాంటమ్ డాట్స్ బిలియన్ కలర్స్ రసాయనశాస్త్ర మోడల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రదర్శనలు పరిశీలించి విద్యార్థులను అభినందించారు. డైరెక్టర్ సంతనుభట్టాచార్య, ఫ్యాకల్టీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు

● సామాజిక తనిఖీలో అధికారుల వెల్లడి
● గంగుడుపల్లె ఎఫ్ఏకు రూ.5వేల జరిమానా



మాట్లాడుతున్న పీడీ శ్రీనివాస్‌ప్రసాద్

చంద్రగిరి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలంలోని ఉపాధి హామీ పనుల్లో భారీగా అవకతవకలు చోటు చేసుకు న్నాయని అధికారులు నిర్ధారించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయలంలో సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. మండలంలో 2023-24వ సంవత్సరంలో 915 పనులకు గాను అందులో ఉపాధి పనులు 880, పంచాయతీ రాజ్‌లో 33, సర్వశిక్ష అభియాన్‌లో 2 పనులు నిర్వహించారు. 4488 మంది కూలీలు పనిచేశారు. మొత్తం రూ.8,17,00,876 కోట్లు ఖర్చు చేశారు. దీనిపై పంచాయతీల వారీగా నివేదికలను చదివి వినిపించారు. ఏ.రంగంపేట పంచాయతీలో స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి తన అధికార బలాన్ని ఉపయోగించి తన భార్య ఉపాధి పనులు చేయకపోయినా బిల్లులను తీసుకుంటున్నట్లు ఆడిట్ అధికారులు వివరించారు. మామండూరులో మస్టర్లలో అక్రమాలు చోటు చేసుకున్నట్లు తెలిపారు. మొక్కలు లేకుండానే బిల్లులు చేసినట్లు గుర్తించారు. 2024 డిసెంబరు నాటికి బిల్లులు పూర్తి చేసినా మొన్నటి వరకు కూడా మొక్కలు నాటారంటూ ఆడిట్ సిబ్బంది పీడీకి నివేదించారు. దోర్నకంబాలలో మస్టర్లలో సంతకాలు లేకుండానే పేమెంట్ చేశారని, పిచ్చినాయుడుపల్లిలో ఫీల్డ్ అసిస్టెంట్ కూలీలకు బదులుగా మరొకరితో పనులు చేయించి వారికి బిల్లులు మంజూరు చేసినట్లు గుర్తించారు. గంగుడుపల్లిలో ఇంకుడు గుంతలు లేకపోయినా బిల్లులు చేసుకున్నట్లు గుర్తించారు. మస్టర్లలో హాజరు నమోదు చేయకుండా బిల్లులు తీసుకున్నట్లు ఆడిట్ సిబ్బంది తెలియజేశారు. గంగుడుపల్లె ఫీల్డ్ అసిస్టెంట్‌కు రూ.5వేలు జరిమాన విధించారు. భీమవరం గ్రామంలో ఇంకుడు గుంతలు తవ్వి బిల్లులు మంజూరు చేసుకుని ఆపై పూడ్చేసినట్లు గుర్తించారు. అగరాల పంచాయతీలోని ఉపాధి పనుల్లో రూ.4లక్షల వరకు అవినీతి జరిగిందని సర్పంచ్ భాస్కర్‌రెడ్డి పీడీకి ఫిర్యాదు చేశారు. పంచాయతీలో 14 మంది పనిచేస్తుంటే 48 మంది చేస్తున్నట్లు మస్టర్లలో నమోదు చేశారని పేర్కొన్నారు. దీనిపై వారంలోపు విచారణ చేపట్టాలని పీడీ శ్రీనివాస ప్రసాద్ ఎంపీడీవో శేఖర్‌ను ఆదేశించారు. అక్రమాలకు పాల్పడిన వారి నుంచి సొమ్ము రికవరీ చేసి క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఏ.రంగంపేట మేజర్ పంచాయతీలో అక్రమాలు జరుగుతుంటే ఎందుకు మౌనంగా ఉన్నారంటూ అధికారులపై మండిపడ్డారు. మస్టర్లు, సంతకాలు వ్యత్యాసం ఉండడంతో ఎఫ్ఏల నుంచి రూ.7వేలు రికవరీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, డీవీవో శివయ్య, ఏపీడీ చిన్నరెడ్డెప్ప, ఏవీవో గణేష్‌కుమార్, ఏపీవో జ్యోతి, ఎస్ఆర్పీ రవి, సిబ్బంది, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

స్టైఫండ్ పెంచేవరకు సమ్మె కొనసాగిస్తాం

● పరిపాలనా భవనాన్ని ముట్టడించిన వెటర్నరీ విద్యార్థులు



పరిపాలనాభవనం లోపల నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

తిరుపతిరూరల్, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచేవరకు నిరవధిక సమ్మెని యథావిధిగా కొనసాగిస్తామని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు స్పష్టం చేశారు. శుక్రవారం వర్సిటీ పరిపాలనా భవనాన్ని ముట్ట డించారు. పరిపాలనా భవనం ఎదుట రోడ్డుపై, లోపల హాలులో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వర్సిటీ ప్రధానగేటు ఎదురుగా ఏర్పాటు చేసిన దీక్షాశిబిరం వద్దకు చేరుకుని బైఠాయించి యథావిధిగా సమ్మెని కొనసాగించారు.

తరగతులకు హాజరుకండి లేదా హాస్టళ్లు ఖాళీ చేయండి

స్టైఫండ్ పెంచాలని వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిర వధిక సమ్మెని వెంటనే విరమించి శనివారం నుంచి తరగతులకు హాజరు కావాలని, లేనిపక్షంలో ఈ నెల 2న సాయంత్రం లోపు హాస్టళ్లని ఖాళీ చేయాల్సి ఉంటుందని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 3వ తేదీ ఉదయం నుంచి మెస్, హాస్టళ్లని పూర్తిగా మూసివేస్తామని అందులో పొందుపరిచారు. వర్సిటీ పరిధి లోని నాలుగు కళాశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడాలని ఏడీలకు, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బందికి, అధ్యాపకులకు డీన్ సూచించారు.

శాస్త్రసాంకేతికతపై పట్టు సాధించాలి



విద్యావైజ్ఞానిక ప్రదర్శనలను పరిశీలిస్తున్న ఎంఈవోలు బాలసుబ్రమణ్యం, సతీష్‌బాబు

ఎర్రావారిపాళెం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్ర సాంకేతికతపై పట్టు సాధించాలని ఎంఈవోలు బాలసుబ్రమణ్యం, సతీష్ బాబు కోరారు. శుక్రవారం సైన్స్‌డే మండలంలో ఘనంగా జరిగింది. ఎర్రావారి పాళెం, ఎలమంద, నెరబైలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నారు. నెరబైలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవోలు బాలసుబ్రమణ్యం, సతీష్ బాబులు సైన్స్ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు లాల్‌షా, నాగరాజ, సిద్ధయ్య, రమేష్, నాగరాజు, శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆహార ఉత్పత్తుల తయారీపై శిక్షణ

తిరుపతి (విశ్వవిద్యాలయా లు), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలతో ఆహార పదార్థాల తయారీపై ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో మహిళలకు శిక్షణ ఇచ్చారు. నిపుణులు కలీముల్లా ఆహార ఉత్పత్తుల తయారీ, ఉపయోగాలపై అవగాహన కల్పించారు. జొన్న, రాగి, సద్ద బిస్కెట్లు, లడ్డు, పబ్బిళ్లలు, మురుకులు తయారీపై అవగాహన కల్పించారు. చిన్నగొట్టిగల్లుకు చెందిన 25 మంది మహిళలకు వంటల తయారీ ఉపకరణాలనుఆర్ఏఆర్ఎస్ అధికారి సుమతి, కళాశాల అసోసియేట్ డీన్ రమణ అందజేశారు.

మానవ సంబంధాలను మానవీకరించేది సాహిత్యమే



సభలో మాట్లాడుతున్న డీన్ వాణి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పతనమవుతున్న మానవ సంబంధాలను మానవీకరించడం సాహిత్యం ద్వారానే సాధ్యమవుతుందని పద్మావతి యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ వాణి కోరారు. తెలుగు విభాగంలో శుక్రవారం నిర్వహించిన కేకలతూరి కృష్ణయ్య స్మారకోపన్యాస సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. పుస్తక పఠనం చైతన్యాన్ని కలిగిస్తుందన్నారు. రచయిత పలమనేరు బాలాజీ, సాహిత్యవేత్త అత్తలూరి విజయలక్ష్మి, కవి నెమిలేటి కిట్టన్న మాట్లాడుతూ మానవ సంబంధాలను ఉన్నతీకరించడానికి తెలుగు నవల తోడ్పడుతుందన్నారు. ధ్వంసమవుతున్న మానవ సంబంధాలను నాటక సాహిత్యం ప్రతిబింబిస్తుందన్నారు. తెలుగు విభాగాధిపతి ఆచార్య మధుజ్యోతి సభాధ్యక్షత వహించారు. సదస్సు సంచాలకులుగా డాక్టర్ వై.సుభాషిణి వ్యవహరించారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకోవాలి



సైన్స్ క్యాలెండర్ ఆవిష్కరణలో వీసీ తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకోవాలని పలువురు వక్తలు కోరారు. ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో సైన్స్ డే శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వీసీ ప్రొఫెసర్ అప్పారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు,, యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీ డైరెక్టర్ ప్రొఫెసర్ సురేంద్రబాబు, స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ మురళీధర్, సీడీసీ డీన్ చెంగ్రాయుడు, టీటీడీ పాలకమండలి సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ పాల్గొని మాట్లాడారు. యూనివర్సిటీలో శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన పరిశోధనలు గొప్పగా జరిగాయన్నారు. భవిష్యత్తులోనూ ఇదే తరహా స్ఫూర్తితో పరిశోధనల ద్వారా కొత్త ఆవిష్కరణలు చేయాలన్నారు. క్యాంపస్ స్కూల్లో శాస్త్రీయ ప్రదర్శనలు, నాటక ప్రదర్శన నిర్వహించారు. ఫిజిక్స్ విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో ఫిజిక్స్ హెడ్ ప్రొఫెసర్ దేవప్రసాదరాజు పాల్గొని మాట్లాడారు. ప్రొఫెసర్లు హుస్సేన్, విజయభాస్కర రావు, అపర్ణ, పద్మావతి, విజయలక్ష్మి, బాలగోపాలరెడ్డి, వెంకటరమణరెడ్డి, హేమలత మాట్లాడారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం

చంద్రగిరి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ దినోత్సవం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈవోలు లలితకుమారి, భాస్కర్‌బాబులు మండలంలోని నరసింగాపురం, ఎం.కొంగరవారిపల్లి, చంద్రగిరిలోని పద్మావతి బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ, పోస్టర్ ప్రజెంటేషన్, ఎగ్జిబిట్స్ ప్రదర్శన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఆయా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రామమూర్తి, నాదముని, వెంకటరమణరెడ్డి, విజయ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాల భర్తీకి చర్యలు

● టీటీడీ ఉద్యోగుల క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో చైర్మన్



తిరుపతి(క్రీడలు), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టి యువతకు ఉపాధి అవకాశం కల్పిస్తామని టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు తెలిపారు. శుక్రవారం ఉదయం టీటీడీ పరిపాలన భవనం వెనుక పరేడ్‌గ్రౌండ్‌లో టీటీడీ వార్షిక క్రీడలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా టీటీడీ చైర్మన్‌తో పాటు ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, జేఈవో వీరబ్రహ్మం హాజరై క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి, బెలూన్స్ శాంతి కపోతాలను ఎగురవేశారు. చైర్మన్ మాట్లాడుతూ టీటీడీ ఉద్యోగులు జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో రాణించే స్థాయికి ఎదగాలని కోరారు. ఉద్యోగుల కోసం ప్రత్యేక స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు చేపడుతామని స్పష్టం చేశారు. ఈవో మాట్లాడుతూ ఉద్యోగుల పని, మానసిక ఒత్తిడి తగ్గించడానికి క్రీడా పోటీలు ఉపయోగపడతాయన్నారు. అదనపు ఈవో మాట్లాడుతూ క్రీడల ద్వారా ఆరోగ్య సమస్యలను అదుపులో ఉంచుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్వో ఎ.వరప్రసాద్‌రావు, సీపీఆర్వో డాక్టర్.టి.రవి, వీజీవో సదాలక్ష్మి, వెల్ఫేర్ ఆఫీసర్ ఎ.ఆనందరాజు, డిప్యూటీ ఈవోలు గోవిందరాజన్, దామోదరం, దేవేంద్రబాబు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

క్రీడలివే: టగ్ ఆఫ్ వార్, చదరంగం, వాలీబాల్, క్యారమ్స్, బాల్‌బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, క్రికెట్, షటిల్, టెన్నిస్.

కపిలేశ్వరాలయంలో వైభవంగా త్రిశూలస్నానం

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు

తిరుపతి(కపిలతీర్థం), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం త్రిశూలస్నానం వైభవంగా నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు నటరాజస్వామి సూర్యప్రభ వాహనంపై కొలువుదీరి కపిలతీర్థం కూడలి, అన్నారావు సర్కిల్ వరకు ఊరేగింపుగా వెళ్లారు. భక్తులు కర్పూర హారతులతో మొక్కులు చెల్లించుకుని, స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 9 గంటలకు అర్చకులు శాస్త్రోక్తంగా త్రిశూలస్నానం జరిపి, స్నపన తిరుమంజనం నిర్వహించి శాంతి జరిపారు. పూర్ణాహుతి, కలశోద్వాసనం, మూలవర్లకు కలశాభిషేకం నిర్వహించారు. సాయంత్రం ధ్వజావరోహణంతో కపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. రాత్రి 8 నుంచి 10 గంటల వరకు స్వామివారు రావణాసుర వాహనసేవలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.


త్రిశూల స్నానం నిర్వహిస్తున్న వేదపండితులు - స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

ఆర్టీసీలో 13మంది ఉద్యోగ విరమణ


పదవీ విరమణ ఉద్యోగులను సన్మానిస్తున్న సహచరులు

తిరుపతి (ఆర్టీసీ), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో జిల్లావ్యాప్తంగా శుక్రవారం 13మంది ఉద్యోగ విరమణ చేశారు. ఇందులో తిరుపతి డిపో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేసిన జి.సుధాకర్, కె.మునివెంకటరాయులు(ఏడీసీ), టి.రామిరెడ్డి, కె.భాస్కర్(కండక్టర్లు), తిరుమల డిపోకు చెందిన ఎస్.రెడ్డెప్ప(ఎ.ఎం), ఈ.జగన్నాథం(కండక్టర్), ఎం.ఎస్.మణ్యం(డిప్యూటీ సూపరింటెండెంట్), వెంకటగిరి డిపోకు చెందిన బి.భాస్కర్, కె.మునస్వామి(డ్రైవర్లు), సి.నాగరాజ(డ్రైవర్, డీపీటీవో ఆఫీసు), గూడూరు డిపోకు చెందిన ఎ.కిషోర్‌కుమార్(సూపరింటెండెంట్), పుత్తూరు డిపోకు చెందిన కె.ఎన్.రాజు(డ్రైవర్), శ్రీకాళహస్తి డిపోకు చెందిన ఎస్.కె.బాషా(డ్రైవర్) ఉన్నారు. కాగా, సుధాకర్‌ను అధికారులు, సహచర ఉద్యోగులు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు.

సీబీఎస్‌లో ఎస్పీ స్పెషల్ ఫోర్స్ నిఘా


సెంట్రల్ బస్టాండులో స్పెషల్ ఫోర్స్ నిఘా

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల భద్రతా దృష్ట్యా ఆర్టీసీ సెంట్రల్ బస్టాండులో ఎస్పీ స్పెషల్ ఫోర్స్ నిఘా ఏర్పాటు చేశారు. ఆరుగురు బృందంగా 24 గంటలు పహారా కాస్తున్నారు. ముఖ్యంగా చోరీలపై దృష్టి పెట్టారు. అనుమానితులను విచారిస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలపైనా నిఘా వేశారు. అనధికార వ్యాపారులను అడ్డుకుంటున్నారు. దీనిపై ప్రయాణికులతో పాటు ఆర్టీసీ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చార్టర్డ్ అకౌంటెంట్స్ నూతన కార్యవర్గం



తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అఖిలభారత చార్టర్డ్ అకౌంటెంట్స్ తిరుపతి శాఖ నూతన కార్యవర్గం శుక్రవారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా బి.వి.మధుసూదనబాబు, ఉపాధ్యక్షుడిగా మన్నెం సింహాద్రినాయుడు, కార్యనిర్వహణ అధికారిగా బాలాజీ కామిశెట్టి, కోశాధికారిగా ఎం.నరేంద్ర, సికాస(సదరన్ ఇండియా చార్టర్డ్ అకౌంటెంట్ స్టూడెంట్ అసోసియేషన్) చైర్మన్‌గా ఎ.తిరుమలేశ్వరనాయుడు, సభ్యులుగా ఎ.మదనమోహన్‌రెడ్డి నియమితులయ్యారు. పలువురు ప్రముఖులు, సీఏలు నూతన కమిటీని అభినందించారు.

మంగళం చెరువు చేపల టెండర్ ఖరారు

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): న్యూ మంగళం చెరువు చెపల టెండర్ ఖరారైంది. గతేడాది అదే గ్రామానికి చెందిన కె.గంగాధరం రూ.9.5లక్షలతో టెండర్ దక్కించుకున్నాడు. నష్టం వచ్చినట్లు ఇటీవల ఆయన కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విన్నవించుకున్నారు. పరిశీలించిన కలెక్టర్ సంబంధిత విభాగంతో అధ్యయనం చేయించి, అప్పటి టెండర్‌కు 33 శాతం అదనంగా అదే వ్యక్తికి కేటాయించాలని ఆదేశాలు జారీ చేశారు. గత టెండర్‌కు అదనంగా 33 శాతం(రూ.12,63,500), దానికి 2శాతం స్టాంప్ డ్యూటీ మొత్తం కలిపి రూ.12,88,770లుగా నిర్ణయించారు. మూడు రోజుల్లోపు ఈ మొత్తం చెల్లించాల్సి ఉంటుందని శెట్టిపల్లి సచివాలయ కార్యదర్శి మురళి తెలిపారు. కాగా, అన్నాచెరువుకు శనివారం బహిరంగ వేలం నిర్వహించనున్నారు. తిరుమలనగర్ సచివాలయ పరిధిలోని చెన్నాయగుంట చెరువును రూ.3లక్షలకు తీసుకునేందుకు స్థానిక శ్రీసత్యసాయి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ముందుకొచ్చిందని కార్యదర్శి స్వాతిశ్రీ తెలిపారు.

2వేల ఇళ్లకు సోలార్ కనెక్షన్లు

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : పీఎం సూర్యఘర్ యోజన పథకంలో భాగంగా చంద్రగిరి నియోజక వర్గంలోని భీమవరం, కందులవారిపల్లి, రంగంపేట సచివాలయాల పరిధిలో 2వేల ఇళ్లకు రూ.22 కోట్లతో సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన సమయంలోపు పనులు పూర్తి చేయడానికి ఆరుగురు కాంట్రాక్టర్లను నియమించారు. పనుల్లో వేగం పెంచడానికి విద్యుత్ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో ఘనంగా సైన్స్‌డే


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న వీసీ వెంకటరమణ

మంగళం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం సైన్స్ డే ఘనంగా నిర్వహించారు. తిరుపతి జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ వారి సహకారంతో ఫిబ్రవరి 2వ తేదీ నుంచి విద్యార్థులకు నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విజేతలకు ముఖ్య అతిథిగా వచ్చిన శ్రీవెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ పంజాల వెంకటరమణ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. తిరుపతి నారాయణ స్కూల్ విద్యార్థులు గ్రీష్మరెడ్డి, దిలీప్‌రెడ్డి మొదటి, రేణిగుంట తపస్య స్కూల్‌కు చెందిన ప్రణీత్, జస్వర్ధన్ రెండో బహుమతి, తిరుపతి భారతీయ విద్యాభవన్‌కు చెందిన ఆర్యన్‌రెడ్డి, శ్రీకర్ మూడో బహుమతులు గెలుపొందారని ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ కోలా శ్రీనివాస్ నెప్రూలా చెప్పారు. కార్యక్రమంలో సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్, జేసీఐ తిరుపతి అధ్యక్షుడు శేషసాయి, జోనల్ వైస్ ప్రెసిడెంట్ ప్రదీప్‌కుమార్, సెక్రటరీ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

మాకూ దర్శనం!

టీటీడీ చైర్మన్‌కు తిరుపతి కార్పొరేటర్ల వినతి


చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు

తిరుమల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతినెలా శ్రీవారిని దర్శించుకునే అవకాశం తిరుపతి కార్పొరేటర్లకూ కల్పించాలని నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి వినతిపత్రాన్ని అందజేశారు. డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణతో పాటు కార్పొరేటర్లు చైర్మన్ బీఆర్ నాయుడిని శుక్రవారం తిరుమలలో మర్యాదపూర్వకంగా కలిశారు. నెలకోసారి తమ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనానికి వెళ్లేందుకు రెఫరెన్స్ ప్రొటోకాల్ దర్శనం కేటాయించాలని కోరారు. దీనిపై చైర్మన్ స్పందిస్తూ సీఎం దృష్టికి తీసుకువెళ్లి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఘనంగా టైలర్స్ డే


కేక్‌కట్ చేస్తున్న అసోసియేషన్ నాయకులు

తిరుపతి (జీవకోన), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): శివజ్యోతినగర్‌లోని జీవలింగేశ్వర టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం టైలర్స్ డే ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు శ్రీనివాసులు, గోవిందరాజులు, శరవణ, మురళి, కదిరి రాజేంద్ర పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులను చైతన్యపరచండి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో రైతులను భాగస్వాములను చేస్తూ వారిని చైతన్యపరచాలని జేసీ శుభం బన్సల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై చిన్న, సన్నకారు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కషాయం ద్వారా పంటలు పండించే పద్ధతిని వివరించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు డీఆర్‌డీఏ ద్వారా ప్రోత్సాహకాలు అందించాలని సూచించారు. చిన్నగొట్టిగల్లు మండలానికి చెందిన రైతులు సరస్వతి, సత్యనారాయణ ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు, డీపీఎం షణ్ముగం, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్వీయూలో బోధనేతర ఉద్యోగుల బదిలీలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలో బోధనేతర ఉద్యోగుల బదిలీలు పెద్ద సంఖ్యలో జరిగాయి. డిప్యూటీ రిజిస్ట్రార్లు, సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేటర్లు ఇలా సుమారు 82 మందిని బదిలీ చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులను అధికారులు జారీ చేశారు. అధికారి స్థాయిలో 20, సాధారణ ఉద్యోగి స్థాయిలో 62, టైమ్‌స్కేల్‌లో 13, ఎన్ఎంఆర్‌లు 30, హాస్టల్ వర్కర్లు 13 మంది. మొత్తం 137 మందికి స్థానభ్రంశం కలిగింది. అలాగే టైం స్కేల్, ఎన్ఎంఆర్ ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన జాబితాను కూడా అధికారులు ప్రకటించారు. ఇందులో టైం స్కేల్ ఉద్యోగులు 12 మంది, ఎన్ఎంఆర్ ఉద్యోగులు 30 మంది ఉన్నారు. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

నైతిక విలువలతో మెరుగైన సమాజం

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ నైతిక విలువలను పాటించినప్పుడే మెరుగైన సమాజాన్ని సాధించగలమని, అప్పుడే స్వార్థం లేని సేవలను రోగులకు అందించలమని ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ కనకనరసారెడ్డి అన్నారు. రుయాస్పత్రిలోని లెక్చరర్ గ్యాలరీలో ఆస్పత్రిలోని వైద్య సిబ్బందికి శుక్రవారం బ్రహ్మకుమారీస్ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆయన సత్ప్రవర్తన, నైతిక విలువలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలంటే మొదట మనం సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రవిప్రభు, ఏఆర్ఎంవో హరికృష్ణ, బ్రహ్మకుమారీస్ నిర్వాహకులు ప్రసన్న, బాషా తదితరులు పాల్గొన్నారు.

చెక్ బౌన్సు కేసులో ఇద్దరికి జైలుశిక్ష

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): చెక్‌బౌన్సు కేసులో ఇద్దరు నిందితులకు ఏడాదిన్నర జైలుశిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ తిరుపతి ఒకటవ జూనియర్ సివిల్ జడ్జి సత్యకాంత్ కుమార్ శుక్రవారం తీర్పు చెప్పారు. ఎస్వీయూ సీఐ రామయ్య వివరాల మేరకు... తిరుపతి రూరల్ మండలం మల్లంగుంటకు చెందిన హోటల్ నిర్వాహకుడు నాగరత్నం రెడ్డి వ్యాపార నిమిత్తం తిరుపతికి చెందిన జయచంద్ర యాదవ్ వద్ద 2016కు ముందు అప్పుగా రూ.3 లక్షలు తీసుకున్నాడు. ఇందుకోసం తన అల్లుడు ప్రియదర్శినీ కాలనీకి చెందిన ఏ సుబ్రహ్మణ్యం రెడ్డి పేరు మీద చెక్కు, ప్రామిసరీ నోట్ ఇచ్చారు. అప్పు తిరిగివ్వమని ఏడు సంవత్సరాలుగా అడుగుతున్నా సరైన సమాధానం లేకపోవడంతో బాధితుడు కోర్టును ఆశ్రయించారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు ఎస్వీయూ స్టేషన్ సీఐ వారిని అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచగా ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి నాగరత్నం రెడ్డి, సుబ్రమ్మణ్యం రెడ్డిలకు ఏడాదిన్నర పాటు జైలు శిక్ష, రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

పరీక్షలకు విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఈ చంద్రశేఖరరావు

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో శనివారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తిరుపతి టౌన్ డివిజన్ విద్యుత్ ఈఈ వి.చంద్రశేఖరరావు తెలిపారు. శుక్రవారం ఆయన ఎమ్మార్‌పల్లి వద్ద పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. తిరుపతి టౌన్ డివిజన్ పరిధిలో 27 పరీక్ష కేంద్రాలు న్నాయని, పరీక్షల సమయంలో విద్యుత్ అంతరాయం రాకుండా చర్యలు తీసుకోవాలని ఏఈ, డీఈఈలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేపట్టామన్నారు.

అలరించిన సైన్స్ మేళా


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న హెచ్ఎం కేశవులనాయుడు

తిరుపతి అర్బన్,ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మంగళం ట్రెండ్స్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ విభాగాల నుంచి విద్యార్థులు 101 వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రదర్శించారు. ఎలక్ట్రో ప్లేటింగ్ ప్రయోగం మొదటి బహుమతి గెలుచుకున్నట్లు న్యాయ నిర్ణేతలు ప్రకటించారు. హెచ్ఎం కేశవులనాయుడు మాట్లాడుతూ విద్యార్థులు తమ పరిశీలనా శక్తితో నూతన ఆవిష్కరణలు చేయాలని సూచించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించండి

తిరుపతి, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు అందరూ కలసి రావాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై శుక్రవారం తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, దుకాణాల యజమానులతో ఆమె సమావేశమయ్యారు. ప్రజా జీవనానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు నగరంలోని ప్రతి ఒక్కరూ కలసి రావాలని కోరారు. గుడ్డ బ్యాగులు ఇవ్వడం, పేపర్ కవర్లు వాడడం, మాంసాహార దుకాణాల వారు టిఫిన్ బాక్సులు వినియోగించడం వంటివి చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీఈలు రాజు, మహేష్, మధు, రమణ, లలిత, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవిలు పాల్గొన్నారు.

మొబైల్ దుకాణంలో చోరీ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఒక మొబైల్ దుకాణంలో గురువారం చోరీ జరిగింది. అలిపిరి ఎస్ఐ నాగార్జున రెడ్డి వివరాల మేరకు... కరకంబాడీ రోడ్డులోని అక్కారంపల్లి వద్ద ఉన్న హెచ్ఎస్ ఎంటర్‌ప్రైజస్ మొబైల్ దుకాణంలోకి దొంగలు చొరబడ్డారు. రేకులు కట్ చేసి లోపలకు ప్రవేశించారు. దుకాణంలో రూ.1.67 లక్షల విలువ చేసే 11 మొబైల్ ఫోన్లు చోరీ చేశారు. దుకాణ యజమాని శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్త అవసరం


ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న మితాంతయ

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అవగాహన కలిగి, అప్రమత్తంగా వ్యవహరించాలని కెనరా బ్యాంక్ సర్కిల్ ఆఫీస్ హెడ్, జనరల్ మేనేజర్ ఐ.పి.మితాంతయ సూచించారు. బ్యాంకు తిరుపతి సర్కిల్ కార్యాలయం ఆధ్వర్యంలో డిజిటల్ మోసాలపై ప్రచార కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని, లేదా ఇందుకు నిర్దేశించిన www.cybercrime.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని అన్నారు. అనంతరం వాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం జీఎస్.మూర్తి, రవీంద్రకుమార్, అగర్వాల్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం


శ్రీచైతన్య పాఠశాలలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): న్యూ ఇందిరా నగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నాగార్జున వర్సిటీ మాజీ వీసీ, ఎస్వీయూ ఫిజిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.విజయభాస్కర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు ఏర్పాటుచేసిన వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించి అభినందించారు. పాఠశాల హెచ్ఎం శ్రీవాణి, జోనల్ కోఆర్డినేటర్ బాలాజీ, ప్రాథమిక పాఠశాలల కో-ఆర్డినేటర్ లావణ్య, జోనల్ డీన్ కాశీరావు, వైస్ ప్రిన్సిపాల్ కీర్తి, ఐకాన్ ఇన్‌చార్జి త్రిలోక్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● మంగళంలోని శ్రీనివాస ఇంగ్లిష్ మీడియం స్కూల్లో విద్యార్థులు ఏర్పాటుచేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఫ్యూచర్ సిటీ పేరున ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా నగరాలను ఎలా నిర్మించాలన్న ప్రదర్శన అందరి ప్రశంసలు అందుకుంది. ఈ కార్యక్రమాన్ని తిరుపతి ఎంఈఓ బాలాజీ ప్రారంభించారు. పాఠశాల డైరెక్టర్ సుబ్రహ్మణ్యంరాజు పాల్గొన్నారు.



హన్సిక

శ్రీవారి సేవలో ప్రముఖులు



వంశీ పైడిపల్లి

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. విధానసభ లోక్ ఫండ్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎంఆర్ సంజయ్ రథన్, ఎంఎల్సీ సత్యవతి రాథోడ్, సినీ దర్శకుడు వంశీ పైడిపల్లి, హీరోయిన్ హన్సిక ఉన్నారు.

- తిరుమల,ఆంధ్రజ్యోతి

నేడు పింఛన్ల పంపిణీ

● 2,62,461మంది లబ్ధిదారులకు రూ.112.06కోట్లు కేటాయింపు


తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను శనివారం పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం తెలిపారు. జిల్లాలో 2,62,461మంది లబ్ధిదారులకు వారి ఇళ్లవద్దే అందజేయనున్నట్లు వివరించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.112.06 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి పంపిణీ ప్రారంభవుతుందని పేర్కొన్నారు.

ఒకరోజు అన్నదానానికి రూ.44 లక్షలు

తిరుమలలో ఒక రోజు అన్నదానం చేయాలనుకున్నవారు రూ.44 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని టీటీడీ తెలిపింది. పెరిగిన సరుకులు, కూరగాయల ధరల వల్ల రూ.38 లక్షలున్న మొత్తాన్ని గత అక్టోబరులో రూ.44 లక్షలకు పెంచారు. 2023 అక్టోబరుదాకా ఈ మొత్తం 33 లక్షలుగా ఉండేది. ఇందులో ఉదయం అల్పాహారానికి రూ.10 లక్షలు, మధ్యాహ్నం భోజనానికి రూ.17 లక్షలు, రాత్రి భోజనానికి రూ.17 లక్షలు వినియోగిస్తారు. కాగా, దాతలే స్వయంగా అన్నప్రసాదాలను వడ్డించే అవకాశాన్ని టీటీడీ కల్పిస్తుంది. విరాళం అందించే దాత పేరును వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో ఆరోజు ప్రదర్శిస్తారు.

- తిరుమల,ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 5 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 5 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 6 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.72 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,627

తలనీలాలు సమర్పించినవారు: 15,468

అధికార నందిపై ఆదిదేవుడు



అధికార నందిపై శ్రీకాళహస్తీశ్వరుడు, కామధేనువుపై జ్ఞానప్రసూనాంబదేవి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తన భక్తాగ్రేసరుడైన అధికార నందిపై ఆదిదేవుడు ఊరేగుతూ భక్తులను పరవశింపజేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం స్వామివారు అధికారనందిపై, అమ్మవారు కామధేనువుపై భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు ఆలయంలోని యాగశాలలో కలశాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అలంకార మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవర్లను అలంకరించి హారతులు సమర్పించారు. స్వామి, అమ్మవార్లను రాజగోపురం వద్దకు తీసుకొచ్చి అధికార నంది, కామధేనువుపై కొలువుదీర్చారు. స్వామి అమ్మవార్లకు ముందు వరసలో శివ పరివారమైన పంచమూర్తులు సాగారు. కళాకారుల ప్రదర్శనలు, కేరళ వాయిద్యాలు, కోలాట నృత్యాలు, కీలుబొమ్మల ప్రదర్శనలు, వివిధ దేవతా మూర్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. చతుర్మాడ వీధుల్లో భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని హారతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో వేదపండితులకు పట్టువస్త్రాలు అందజేస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

శివపార్వతుల కల్యాణానికి టీటీడీ పట్టువస్త్రాలు

ఏటా మహాశివరాత్రి ఉత్సవాల్లో కల్యాణోత్సవానికి టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. శనివారం తెల్లవారుజామున శివపార్వతుల కల్యాణోత్సం జరగనున్న నేపథ్యంలో శుక్రవారం టీటీడీ ఈవో శ్యామలరావు పట్టువస్త్రాలను తీసుకురాగా, ఆలయం వద్ద ముక్కంటి ఆలయ ఈవో బాపిరెడ్డి, అధికారులు స్వాగతం పలికారు. ఆలయంలోని అలంకార మండపానికి చేరుకుని పట్టువస్త్రాలను వేదపండితులకు అందజేశారు. వీటిని శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబదేవికి అలంకరించారు. అనంతరం ఈవో శ్యామలరావు ముక్కంటిని దర్శించుకున్నారు. ఆది దంపతుల కల్యాణానికి పట్టువస్త్రాలు సమర్పించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు టీటీడీ ఈవో చెప్పారు.

నేడు సభాపతి కల్యాణం : శనివారం సభాపతి కల్యాణం నిర్వహించనున్నారు. సభాపతిగా పిలవబడే నటరాజస్వామికి శివకామ సుందరితో కల్యాణం నిర్వహిస్తారు. ఈ కల్యాణం ఆలయ ప్రాంగణంలోని 16 కాళ్ల మండపం వద్ద జరుగుతుంది. సభాపతి కల్యాణం జరిగే రాత్రిని ఆనందరాత్రిగా వ్యవహరిస్తారు. నాగభూషణుడు నటరాజుగా ఆనందతాండవం చేస్తాడు. నారదుడు, తుంబరుడు, సకల యక్ష, గంధర్వ గానంతో, వాయిద్య ఘోషలతో ఆనందరాత్రి వేళ కైలాసగిరులు ప్రతిధ్వనించనున్నాయి. కాగా, శనివారం ఉదయం 11.00గంటలకు రుద్రాక్ష అంబారీ వాహన సేవ జరగనుంది.

బడ్జెట్‌పై ప్రతిస్పందన

కూటమి ప్రభుత్వం శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై జిల్లాకు చెందిన పలువురి ప్రతి స్పందన ఇదీ..

అంకెల గారడీ

తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు నిధుల కేటాయింపు చూసినట్లయితే లబ్ధిదారుల సంఖ్యలో భారీగా కోత పడేటట్లు ఉంది. ప్రజలు, ప్రతిపక్షాల ఒత్తిళ్ల తట్టుకోలేక ఈ రెండు పథకాలకు నిధులు కేటాయించినట్లు కనిపిస్తుంది. హామీలను పక్కన పెట్టి, కేవలం అంకెల గారడీ చేశారు.

- మద్దెల గురుమూర్తి, తిరుపతి ఎంపీ

ప్రజారంజకం

అన్ని వర్గాల సంక్షేమంతో పాటు విద్య, వైద్యానికి పెద్దపీట వేసిన ప్రజారంజకమైన బడ్జెట్ ఇది. ఎన్నికల మ్యానిఫెస్టోలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీలు మొదటి ఏడాదిలోనే అమలు చేయడానికి నిధులను కేటాయించడం అభినందనీయం.

- ఆరణి శ్రీనివాసులు, తిరుపతి ఎమ్మెల్యే

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా..

రాష్ట్ర పునర్నిర్మాణానికి పునాదిలా.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణమైన బడ్జెట్. మొట్టమొదటి బడ్జెట్‌లోనే సంక్షేమానికి, అభివృద్ధికి, హామీల అమలుకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. సామాన్యుల కొనుగోలు శక్తి పెరిగేలా, కొత్త పన్నుల భారం మోపకుండా చూశారు.

- గాలి భానుప్రకాశ్, నగరి ఎమ్మెల్యే

ఏపీ పునర్నిర్మాణానికి పునాది

ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి పునాదిలా కేటాయింపులు ఉన్నాయి. గత ప్రభుత్వంలో కనుమరుగైన 73 పథకాలను కూటమి తిరిగి అమలు చేస్తోంది. సూపర్‌సిక్స్ అమలు చేయలేదని విమర్శలు చేసిన వారికి ఈ బడ్జెట్ ఒక సమాధానం.

- నరసింహయాదవ్, తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు

వికసిత ఆంధ్ర బడ్జెట్

ఎన్నికల ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే దిశగా బడ్జెట్ ఉంది. వికసిత భారత్‌లో భాగంగా వికసిత్ ఆంధ్రగా కేటాయింపులు జరిగాయి. చితికిపోయిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ అభివృద్ధి, సంక్షేమానికి ఊతమిచ్చేలా రూపొందించారు.

- సామంచి శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగ, కార్మికులకు నిరాశ

ఉద్యోగ, కార్మికులను నిరాశపరిచేలా బడ్జెట్ ఉంది. ధరల నియంత్రణను ప్రస్తావించలేదు. కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపు, స్కీమ్ వర్కర్ల వేతనాల గురించీ పేర్కొనలేదు. ఉద్యోగ, కార్మికులపట్ల లోపభూయిష్టంగా ఉంది.

- కందారపు మురళి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం

ఎన్టీఆర్ వైద్య భరోసాకు రూ.31,613 కోట్లు, రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు రూ.4,220 కోట్లు కేటాయించారు. దీనిని బట్టి ఇటు సంక్షేమం, అటు అభివృద్ధికి ఈ బడ్జెట్‌లో సమ ప్రాధాన్యం ఇచ్చినట్టుగా అనిపిస్తూ ఉంది. అన్ని శాఖలకు సమ ప్రాధాన్యం ఇస్తూ బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. అన్ని వర్గాలు, వృత్తులు, రంగాలను గుర్తిస్తూ దూరదృష్టితో బడ్జెట్ కేటాయింపులు చేశారు.

- డాక్టర్ కొండూరు సునీత, ఎకనమెట్రిక్స్ హెడ్, ఎస్వీయూ

ఆలోచనాత్మక బడ్జెట్

సంక్షేమానికి బడ్జెట్‌లో ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఆలోచనాత్మకంగా బడ్జెట్‌ను రూపకల్పన చేశారు. అన్నివర్గాల ప్రజలు ఆనందంగా ఉండాలన్నదే లక్ష్యం.

- సుగుణమ్మ, తిరుపతి మాజీ ఎమ్మెల్యే

బీసీలకు ఉపయోగం

చరిత్రలో ఎరుగని విధంగా బీసీల అభివృద్ధి, సంక్షేమానికి కేటాయింపులు జరిగాయి. రాష్ట్ర చరిత్రలో ఈ బడ్జెట్ బీసీ బడ్జెట్‌గా నిలిచిపోనుంది.

- రాగల ఆనందగౌడ్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

సంక్షోభంలో సంక్షేమం

ప్రస్తుత ఆర్థిక సంక్షోభంలోనూ అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచేలా, స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యంగా సంక్షేమ బడ్జెట్‌కు రూపకల్పన జరిగింది. నీటి ప్రాజెక్టులకు ఆశాజనకంగా కేటాయింపులున్నాయి.

- నవీన్ కుమార్ రెడ్డి, బీజేపీ నేత

ఆదాయాన్ని పెంచేలా..

రాష్ట్ర ఆదాయాన్ని పెంపొందించేందుకు కృషి చేసే విధంగా ఈ బడ్జెట్ ఉంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అనుకూలం. పేదరిక నిర్మూలనకు ఊతమిచ్చేలా ఉంది. చిన్న తరహా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఉండటం వల్ల ఉపాధి అవకాశాలు పెరగతాయి.

- కొండూరు మోహనకుమారరాజు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు

తెలుగుకు రూ.10 కోట్లు సంతోషకరం

మాతృభాషకున్న ప్రాముఖ్యతను ప్రభుత్వం గుర్తించింది. తెలుగు భాషా సాహిత్యాభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించింది. ఇలా ప్రత్యేక నిధులు కేటాయించడం హర్షించదగ్గ విషయం.

- సాకం నాగరాజ, తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షుడు

భారతీయ భాషల్లో తెలుగు మేటి

- తెలుగు భాషా ముగింపు సమావేశాల్లో ఎస్వీయూ రిజిస్ట్రార్ -

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): భారతీయ భాషల్లో తెలుగు మేటిగా వెలుగొందుతోందని ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు పేర్కొన్నారు. రెండు రోజులు నిర్వహించిన మూడో అంతర్జాతీయ తెలుగు భాషా సమావేశాలు శుక్రవారం ముగిశాయి. ఎస్వీయూ సెనేట్ హాలులో జరిగిన ముగింపు సభలో రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. తెలుగుదనానికి ఎన్టీఆర్ నిలువెత్తు సంతకమన్నారు. తెలుగు విశ్వవిద్యాలయాన్ని ఎన్టీఆర్ స్థాపించిన విషయాన్ని గుర్తు చేశారు. యూనివర్సిటీల్లో తెలుగు భాష పరిశోధనలు సాగాలని ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అభిప్రాయపడ్డారు. తెలుగు భాష గొప్పతనంపై పద్యాలు పాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య సుధారాణి, సదస్సు సంచాలకులు ఆచార్య రాజేశ్వరమ్మ, నిర్వహణ కార్యదర్శి ఆచార్య పీసీ వేంకటేశ్వర్లు, సలహాదారు రేమిళ్ల మూర్తి పాల్గొన్నారు.

తీర్మానాలు

● ప్రాచీన తెలుగు గ్రంథాలను వచనంలోకి మార్చాలి. ● తెలుగు గొప్పదనాన్ని చాటేలా గోడరాతలు రాయాలి. ● బోధన, పాలనలో తెలుగును పటిష్ఠంగా అమలు చేయాలి. ● ప్రతి ఒక్కరూ ఇంటా బయటా తెలుగులో వ్యవహరించాలి.



ముగింపు సభలో ప్రసంగిస్తున్న ఆచార్య భూపతి నాయుడు

దైనందిన జీవితంలో సైన్సు పాత్ర కీలకం



సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న షార్ డైరెక్టర్, కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, ఉద్యోగులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): దైనందిన జీవితంలో సైన్సు పాత్ర ఎంతో కీలకమని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అన్నారు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా షార్ డైరెక్టర్ మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం లేని జీవితాన్ని ఊహించలేమన్నారు. ప్రపంచాన్ని శాసిస్తూ, నడిపించే శక్తిగా సైన్సు కీలకపాత్ర పోషిస్తోందన్నారు. దేశానికే గర్వకారణమైన శాస్త్రవేత్త సీవీ రామన్ ఫిబ్రవరి 28న తన ప్రఖ్యాత 'రామన్ ఎఫెక్ట్‌'ను కొనుకొన్నారు. ఈ ప్రాచుర్యం చెందిన శాస్త్రీయ పరిశోధనకు గౌరవ సూచకంగా 1987 నుంచి ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకోవడం విశేషమన్నారు. సైన్స్ అద్భుతతను, దాని ప్రభావాన్ని మనందరికీ తెలియజేయడంతో జాతీయ సైన్స్ దినోత్సవం ముఖ్య మైలురాయిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో షార్ ఎంఎస్‌ఏ డిప్యూటీ డైరెక్టర్ గోపికృష్ణ, షార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి నుంచి పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల నంబర్ల మార్పు

తిరుపతి(సెంట్రల్), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో పది ఎక్స్‌ప్రెస్ రైళ్లకు శనివారం నుంచి నంబర్లు మారినట్లు సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు. విశాఖపట్నం-కడప(18521), కడప-విశాఖపట్నం (18522), విశాఖపట్నం- గుంటూరు(22875), గుంటూరు-విశాఖపట్నం (22876), భువనేశ్వర్- రామేశ్వరం(20895)గా మారుతాయి. అలాగే రామేశ్వరం-భువనేశ్వర్ (20896) 9 నుంచి, భువనేశ్వర్-పుదుచ్చేరి(12897) 4నుంచి, పుదుచ్చేరి-భువనేశ్వర్ (12898) 5 నుంచి, భువనేశ్వర్-చెన్నై సెంట్రల్ (12829) 6 నుంచి, చెన్నై సెంట్రల్-భువనేశ్వర్(12830) మార్చి 7వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని వెల్లడించారు. ప్రయాణికులు గుర్తించి, టిక్కెట్ రిజర్వేషన్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేడు జీడీనెల్లూరుకు సీఎం రాక



గంగాధరనెల్లూరు దళితవాడలో ప్రభుత్వ విప్ థామస్,టీడీపీ నేతలతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్/తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరులో శనివారం సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 11.25 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు.అక్కడినుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.50 గంటలకు జీడీనెల్లూరు మండలం రామానాయుడుపల్లెకు చేరుకుంటారు. మధ్యాహ్నం 12 నుంచి 12.20 వరకు ప్రజాప్రతినిధులతో సమావేశమౌతారు. ఒంటిగంటకు గంగాధరనెల్లూరుకు చేరుకుని ఎన్టీఆర్ భరోసా పెన్షనర్ల ఇండ్లకు చేరుకుని పింఛన్ పంపిణీ చేస్తారు.అనంతరం 'పది సూత్రాలు' అంశంపై అక్కడ 10 ప్రభుత్వశాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శనశాలను 1.30- 1.55 గంటల వరకు పరిశీలిస్తారు. 1.55 నుంచి 2.55 వరకు గ్రామస్థులతో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు.అనంతరం రోడ్డుమార్గాన రామానాయుడుపల్లికి 3 గంటలకు చేరుకుంటారు. అక్కడే 25 నిమిషాల పాటు స్థానిక టీడీపీ నేతలతో సమావేశమవుతారు.అనంతరం తిరుగు ప్రయాణమవుతారు. సీఎం పర్యటనకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం ప్రభుత్వ విప్ వి.ఎం.థామస్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చుడా చైర్మన్ కఠారి హేమలత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీ.ఆర్.రాజన్,నేతలు కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ ఏర్పాట్లను పరిశీలించారు.

కూతురి జ్ఞాపకాలు మరవలేక...

రైలు కిందపడి తండ్రి ఆత్మహత్య



శామ్యూల్ జయకుమార్, లేహనిస్సీ (ఫైల్‌ఫొటోలు)

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నెల రోజుల క్రితం పెళ్లిపీటకెక్కాల్సి రోజున కూతురు గూడూరు పంబలేరు వాగులో శవమై తేలింది. అప్పటి నుంచి కుమార్తె జ్ఞాపకాలను మరిచిపోలేక మనోవేదనకు గురైన తండ్రి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకొన్న హృదయ విదారకర ఘటన శుక్రవారం సూళ్లూరుపేటలో చోటుచేసుకొంది. సూళ్లూరుపేట పట్టణంలోని రాఘవయ్యపేటకు చెందిన శామ్యూల్ జయకుమార్ (59) శుక్రవారం తెల్లవారుజామున స్థానిక రైల్వేగేటు సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకొన్నాడు. మృతుడి బంధువుల సమాచారం మేరకు... జయకుమార్ కూతురు లేహనిస్సీకి బంధువుల అబ్బాయితో జనవరి 30వ తేదీన వివాహం జరిపించేందుకు గత ఏడాది డిసెంబరు 14న నిశ్చితార్థం చేశారు. ఈ నేపథ్యంలో జనవరి 20న లేహనిస్సీ కళాశాలకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో జనవరి 21న సూళ్లూరుపేట పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. జనవరి 29న కళాశాల పక్కనే ఉన్న పంబలేరు వాగులో శవమై తేలడంతో వివాహ వేడుకలు జరగాల్సిన ఇంట్లో విషాదం చోటుచేసుకొంది. అప్పటి నుంచి జయకుమార్ కూతురి జ్ఞాపకాలను తలచుకొంటూ మనోవేదనకు గురై లోలోపల కుమిలిపోయాడు. గురువారం రాత్రి బయటకు వెళ్లిన ఆయన శుక్రవారం ఉదయం రైలు పట్టాలపై శవమై కనిపించాడు. మృతుడి వివరాలు సేకరించిన రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు బంధువులకు సమాచారం ఇచ్చారు. నెలరోజుల వ్యవధిలోనే తండ్రి, కుమార్తె మృతి చెందడంతో జయకుమార్ ఆత్మహత్యతో బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రుయా ఉద్యోగులు ఎస్వీ వైద్య కళాశాలకు మార్పు

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని రుయాస్పత్రి ఉద్యోగులను ఎస్వీ వైద్య కళాశాల కిందకు మారనున్నారు. దీనికి సంబంధించి గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన 168 జీవో.. మార్చి ఒకటి నుంచి అమల్లోకి రానుంది. రుయాలోని సూపరింటెండెంట్, ఏడీ, ఏవో, ఆఫీస్ సూపరింటెండెంట్, ఒక సీనియర్ అసిస్టెంట్.. తప్ప మిగిలిన దాదాపు 900 మందికిపైగా ఉద్యోగులను ఎస్వీ వైద్య కళాశాలకు అనుసంధానం చేస్తూ వీరి రికార్డులను కళాశాలలోని ఏడీకి పంపించారు. ఇకపై వీరు రుయాస్పత్రిలో పనిచేసినా జీతాలు, అరియర్స్ అన్నీ ఎస్వీ వైద్య కళాశాల నుంచే విడుదల చేస్తారు. ఇకపై ఎస్వీ వైద్య కళాశాల ఉద్యోగులగానే వీరిని గుర్తిస్తారు. వైద్యకళాశాల ఏడీ పరిధిలో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

ఎస్వీయూ దూరవిద్యా విభాగం డైరెక్టర్ రాజీనామా

- కొత్త డైరెక్టర్ నియామకానికి పేర్ల పరిశీలన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ దూరవిద్యా విభాగ డైరెక్టర్ ప్రొఫెసర్ తవమణి తన పదవికి రాజీనామా చేశారు. ఆమె సమర్పించిన రాజీనామాకు ఉన్నతాధికారులు కూడా ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది. డీడీఈలో బోటనీ ప్రొఫెసర్‌గా ఉన్న తవమణి వైసీపీ ప్రభుత్వ హయాంలో దూరవిద్యా డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఇటీవల దూరవిద్యా పరీక్షల నిర్వహణలో తలెత్తిన గందరగోళం నేపథ్యంలో ఆమె పదవి నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే తన పదవికి రాజీనామా చేసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో కొత్త వారిని నియమించేందుకు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించాలని అధికారులు ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. జువాలజీ విభాగ ప్రొఫెసర్ కిషోర్, ఇంగ్లిష విభాగ ప్రొఫెసర్ సుమకిరణ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

కంటైనర్ కింద పడి మోటర్ సైక్లిస్టు మృతి



మృతి చెందిన చెంచురామయ్య

పెళ్లకూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కంటైనర్ కిందడి మోటర్ సైక్లిస్టు మృతి చెందిన ఘటన పెళ్లకూరు మండలంలోని సవటకండ్రిగ సమీపంలో 71వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు... నెల్లూరు జిల్లా కోవూరు మండలం వేగూరు రామపురం ఎస్టీ కాలనీకి చెందిన చలంచర్ల చెంచు రామయ్య(58) కుటుంబం తమ బాతులను మేపేందుకు టెంకాయతోపు వద్దకు ఇటీవల వచ్చింది. వరి కోతలు పూర్తయిన పొలాల్లో టెంట్లు వేసుకొని బాతులను మేపుకుంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం కొత్తూరు వద్ద ఉన్న ఓ హోటల్‌లో భోజనం తీసుకుని మోటర్ సైకిల్‌పై బయలుదేరాడు. మార్గమద్యంలో సవటకండ్రిగ వద్ద వెళ్తుండగా కంటైనర్ లారీ ముందు వెళ్తున్న మరో లారీని ఢీకొని అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కంటైనర్ సైకిల్‌పై వెళ్తున్న చెంచురామయ్యపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్రేన్ సహాయంతో కంటైనర్‌ను పైకిలేపి మృతదేహాన్ని వెలికితీసి నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జీవనాధారమైన బాతులను మేపుకునేందుకు వచ్చి విగతజీవిగా మారిన చెంచురామయ్య మృతదేహాన్ని చూసిన బంధువుల రోదనలు మిన్నింటాయి.

రీసర్వే పక్కాగా నిర్వహించండి

రెవెన్యూ అధికారులకు కలెక్టర్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రీసర్వే పక్కాగా చేపట్టి భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రెవెన్యూ అధికారులతో రీసర్వే, భూ సంబంధిత అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్, ఇతర గ్రీవెన్స్ నుంచి వచ్చిన భూ సంబంధిత మ్యుటేషన్, సర్వే, పాసుపుస్తకం, రీసర్వే, పాసుపుస్తకాలు ఇతర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. రీసర్వే ప్రక్రియలో ఎటువంటి తప్పులు లేకుండా చేయాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో రీసర్వే రాళ్లపై రాతలను చెరిపేసే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్య సేవల్లో ఆటంకం లేకుండా చూడండి

పేదలకు, ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ఎన్టీఆర్ వైద్యసేవలు ఆటంకం లేకుండా అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్‌లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకానికి అనుబంధంగా ఉన్న ఆస్పత్రుల మెడికల్ కోఆర్డినేటర్లతో ఆయన సమావేశమయ్యారు. ఎన్టీఆర్ వైద్య సేవలలో ఎవరినైనా ఇబ్బందిపెట్టినా, తప్పుడు నివేదికలు సమర్పించినా చర్యలు తీసుకుంటామన్నారు. పూర్తి ఉచితంగా సేవలు అందించాలని తెలిపారు. రోగులకు అవసరమైన మందులను కొనుగోలు చేయాలని బలవంతం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ వైద్య సేవల జిల్లా సమన్వయకర్త రాజశేఖర్, మేనేజరు శివకుమార్, రుయా అడిషనల్ సీఎస్ఆర్ఎంవో హరికృష్ణ పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

మున్సిపల్ చైర్మన్‌పై వైసీపీ కౌన్సిలర్ల గుర్రు!

- తమ వార్డుల్లో పనులను అజెండాలో చేర్చకపోవడం పట్ల నిరసన
- తల్లొగ్గిన చైర్మన్... కౌన్సిల్ సమావేశం వాయిదా

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీ చైర్మన్ హరి పట్ల వైసీపీ కౌన్సిలర్లు తిరుగుబాటుకు దిగారు. తమను సంప్రదించకుండా వ్యక్తిగత అజెండాలు రూపొందించడంపై మండిపడ్డారు. దీంతో శుక్రవారం జరగాల్సిన కౌన్సిల్ సమావేశం రద్దైంది. ఇందుకు పదిమంది కౌన్సిలర్లు కారణంగా తెలుస్తోంది. తమ వార్డుల్లో అభివృద్ధి పనులకు సంబంధించి అజెండాలో పొందపరచాలని వారు పట్టుబట్టారు. రూ.20 లక్షల పనులను అజెండాలో పొందుపరిచేందుకు చైర్మన్ సిద్ధమయ్యారు. సాధారణ కౌన్సిల్ సమావేశం 3 రోజుల వ్యవధిలో ఏర్పాటు చేయవచ్చు. బడ్జెట్ సమావేశమైతే 7 రోజులు గడువు ఉంటుంది. అత్యవసర సమావేశానికి 24 గంటలలో ఏర్పాటుకు చర్యలు చేపట్టే అవకాశం ఉంది. కాగా, మున్సిపాలిటీలో కౌన్సిల్ సమావేశానికి ముందు రోజు గురువారం కౌన్సిల్ సభ్యులు తమ డిమాండ్లను చైర్మన్ ముందుంచడం పలు అనుమానాలకు తావిస్తోంది. వారిని బుజ్జగించే ప్రయత్నంలో ఆ పది మంది కౌన్సిలర్‌లతో కలిసి కమిషనర్ మంజునాథ్ గౌడ్‌ను కలిసి అజెండాలో మార్పు చేయాలని కోరినట్లు సమాచారం. ఇందుకు కమిషనర్ సమ్మతించకపోవడంతో కౌన్సిల్ సమావేశం రద్దుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సమావేశం రద్దు పట్ల టీడీపీ కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా టైలర్స్ డే

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ లక్ష్మీ వినాయక టైలర్స్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్, మహిళా టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కల్యాణపురంలో ఉన్న మదర్ ఇండియా కమ్యూనిటీ డెవల్మెంట్ అసోసియేషన్ వృద్ధాశ్రమంలో వైద్య శిబిరం నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.

ఉపాధి కూలీలకు బకాయిలను చెల్లించండి

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న కూలిని విడుదల చేయాలని సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీవో రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న కూలీలను విడుదల చేయాలని, 200 రోజులు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. గోపీ, రాజేష్, భాస్కర్, రవి తదితరులు పాల్గొన్నారు.

యువత రక్తదానం చేయాలి



పుత్తూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి):అత్యవసర పరిస్థితుల్లో ప్రమాద బాధితులు, బాలింతలను ఆదుకునేందుకు యువకులు రక్తదానం చేయాలని పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ రక్తదాన ట్రస్ట్ సహకారంతో శుక్రవారం కేకేసీ కళాశాలలో నిర్వహించిన శిబిరంలో 52 మంది రక్తదానం చేశారు. రవిరాజు, కెఎల్ఎస్‌మూర్తి, మహమ్మద్ రఫీ, మునికృష్ణయ్య, గుణశేఖర్‌రెడ్డి, కుప్పయ్యశెట్టి, ప్రిన్సిపాల్ శరవణన్ తదితరులు పాల్గొన్నారు.

శేషాచల ఫార్మసీలో ఘనంగా ఫ్రెషర్స్ డే


ప్రసంగిస్తున్న సుబ్రహ్మణ్యం

పుత్తూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని శేషాచల ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా తహసీల్దార్ సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించకుని విద్యాభ్యాసం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కెఎల్ఎస్ మూర్తి, మునికృష్ణయ్య, విద్యార్థి సంఘనాయకుడు లక్ష్మీనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో సైన్స్‌డే

పుత్తూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): విశ్వమానవాళి సంక్షేమానికి సైన్సు ఉపయోగపడాలని డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వీరయ్య అన్నారు. కళాశాలలో శుక్రవారం సైన్సు డే ఘనంగా జరిగింది. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేలతకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పద్మావతి, శ్యామ్సన్‌రాజు, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలి

కేవీబీపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలో పీ4 ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. అందుకు ప్రజలు అధికారులకు సహకరించాలని ఎంపీడీవో రాధారాణి కోరారు. ముఖ్యంగా గ్రామాల్లో ఇళ్లల్లో ఉన్న కుటుంబ సభ్యుల వివరాలు, అలాగే మిస్సింగ్ సిటిజన్ల వివరాలను, దీంతో పాటు వర్క్ ఫ్రం హోం వివరాలను అందజేయాలన్నారు. వీటితో పాటు చిన్నచిన్న వ్యాపారాలు చేసే వ్యాపారులు తమ వివరాలను విధిగా అధికారులకు తెలియజేయాలన్నారు. 1 నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలకు ఆధార్‌కార్డులను, వాటి వివరాలను తప్పనిసరిగా అధికారులు చెప్పాలన్నారు. శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఉదయం 7గంటల నుంచి పంపిణీ చేస్తామని పింఛనుదారుల ఇళ్ల వద్దకే వచ్చి అధికారులు అందిస్తారన్నారు.

ముక్కంటి సేవలో నేషనల్ హైవేస్ చైర్మన్



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని శుక్రవారం నేషనల్ హైవేస్ చైర్మన్ సంతోష్‌కుమార్, స్టేట్ హైవేస్ చైర్మన్ ఆర్కే సింగ్, జిల్లా హైవేస్ చైర్మన్ వెంకటేష్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ మాజీ చైర్మన్ పుట్టా సుధాకర్‌యాదవ్, రంగినేని చెంచయ్యనాయుడు, విజయకుమార్, కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మలుపులో ముళ్ల పొదల తొలగింపు



బుచ్చినాయుడు కండ్రిగ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీకాళహస్తి - తడ రోడ్డు పార్లపల్లి మలుపు దగ్గర ముళ్ల పొదలను ఎస్ఐ విశ్వనాథనాయుడు, శ్రీకాళహస్తి ఎంవీఐ దామోదరం నాయుడు ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్ ద్వారా తొలగించారు. పార్లపల్లి మలుపు దగ్గర రోడ్డుకు ఇరువైపుల ముళ్ల చెట్లు నిండిపోయి రోడ్డు కనబడకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఆ ప్రాంతలో పొదలను తొలగించడంతో వాహన రాకపోకలకు అంతరాయం లేకుండా పోయింది.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

గూడూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పట్టణంలోని ఎస్‌కేఆర్ జూనియర్ కళాశాల, స్వర్ణాంధ్ర భారతి, సెయింట్ మేరీస్, డీఆర్ డబ్ల్యూ, నారాయణ జూనియర్ కళాశాలల్లోని 5 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా బెంచీలు ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకున్నారు. అర్ధగంటకు ముందే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు.

నాయుడుపేట: పట్టనంలోని ఎస్‌పీజీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీవేమ, ఎల్‌పి సాగరంలోని గురుకుల కళాశాలలో ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

డక్కిలి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవులపల్లి గ్రామంలో బెల్టు షాపు నడుపుతున్న నరసింహులు అనే వ్యక్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 8 మద్యం బాటిళ్ల స్వాదీనం చేసుకొన్నామని ఎస్ఐ శివశంకర్ గౌడ్ తెలిపారు.

జయంపులో పీహెచ్‌సీ ఏర్పాటయ్యేనా!

- 2022లో ఆస్పత్రి నిర్మాణానికి స్థల సేకరణ
- ఇప్పటికీ పునాది కూడా తీయని వైనం
- వైద్యం కోసం గ్రామీణ ప్రజలు తిప్పలు


జయంపులో పీహెచ్‌సీ నిర్మాణం కోసం సేకరించిన స్థలం

బాలాయపల్లి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) మండలంలోని అనేక గ్రామాలకు కూడలిగా ఉన్న జయంపు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకున్నాయి. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆరోగ్య సమస్యలు వస్తే బాలాయపల్లి పీహెచ్‌సీకి వెళ్లాల్సి వస్తుండడంతో జయంపు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని గత వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది. 2022లో ఆస్పత్రి నిర్మాణ పనులు చేపట్టేందుకు అధికారులు హడావుడిగా స్థల సేకరణ చేపట్టారు. వెంటనే ఇద్దరి వైద్యాధికారులు, పీహెచ్‌వో, సూపర్ వైజర్‌ను నియమించారు. కానీ పీహెచ్‌సీ నిర్మాణానికి పునాదులు కూడా తీయకుండా వదిలేశారు. తాత్కాలికంగా అద్దె భవనంలోనైనా పీహెచ్‌సీ ఏర్పాటు చేయకపోవడంతో నియమితులైన వైద్యులు, సూపర్‌వైజర్ బాలాయపల్లి పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్నారు. జయంపుతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ఆరోగ్య సమస్యలు వస్తే బాలాయపల్లి పీహెచ్‌సీకి, లేదా వెంకటగిరి, గూడూరు ఆస్పత్రులకు వెళ్లాల్సిందే. అత్యవసర సమయంలో బయట ప్రాంతాలకు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన సమయంలో చికిత్స అందక కొందరు రోగులు ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిన ఘటనలూ ఉన్నాయని వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి జయంపు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులు సైన్స్‌పట్ల మక్కువ పెంచుకోవాలి



గూడూరులో విద్యార్థినులకు బహుమతులను అందజేస్తున్న ఎంఈవో కాంచన - నాయుడుపేటలో విద్యార్థుల ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎంఈవో మునిరత్నం

గూడూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచే సైన్స్‌పట్ల మక్కువ పెంచుకోవాలని ఎంఈవో కాంచన అన్నారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని జడ్పీ బాలిక ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థినిలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాధవిలక్ష్మి, సుమాలక్ష్మి, శివనారాయణ, ఉషశ్రీ, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు. అలాగే నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సైన్స్ డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్, శ్రీధర్, రఘురాం, ప్రిస్కిల్లా, పద్మయ్య, భవానీ తదితరులు పాల్గొన్నారు. అలాగే గాయత్రి పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పోను ఎంఈవో కాంచన తిలకించారు. స్థానిక వీఎస్ఆర్ పాఠశాలలో విద్యార్థులు సైన్స్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థుల ప్రదర్శనలను ఐడీబీఐ బ్యాంకు మేనేజర్ మహేంద్ర రావు తిలకించి అభినందించారు. కార్యక్రమంలో బాలకృష్ణంరాజు, అన్నపూర్ణా, శాంతిప్రియ, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరు: మండలంలోని చింతవరం రెస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను రిటైడ్ హెచ్‌ఎం సంపత్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివకుమార్, డాక్టర్ శేఖర్, సుల్తాన్ అహ్మద్, కరస్పాండెంట్ బాలచెన్నయ్య, చైర్మన్ వెంకట సుబ్బయ్య, శ్రీనివాసులు, ప్రభాకర్, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

చిట్టమూరు: మండల పరిధిలోని కొత్తగుంట టీఎంఆర్ పాఠశాలలో సైన్స్ దినోత్సవం జరుపుకున్నారు. విద్యార్థులు తాము రూపొందించిన వివిధ నమూనాలను ప్రదర్శించారు. విద్యాసంస్థ అధినేతలు మనోహర్ రెడ్డి, విజయలక్ష్మి, ప్రిన్స్‌పాల్ రహంతుల్లా, ఉపాధ్యాయులు గురు ప్రసాద్, రూపేష్, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీ సేందుకు సైన్స్ ప్రయోగాలు ఎంతో దోహదపడుతాయని ఎంఈవో మునిరత్నం అన్నారు. పట్టణంలోని నారాయణ పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను ఆయన పరిశీలించారు. మేనకూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో మూఢనమ్మకాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పేర్నాటి రామకృష్ణ, స్నేహలత, సుదాదేవి, సుబ్రహ్మణ్యం, రియాజ్, ఏవో గౌస్‌భాషా పాల్గొన్నారు.

కోట: మండల పరిధిలోని చిట్టేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోటలోని ప్రగతి పాఠశాల, విద్యానగర్‌లోని శ్రీనివాస ఉన్నత పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవం జరిగింది. హెచ్‌ఎంలు నిర్మలాదేవి, సురేందర్ రెడ్డి, పసుపులేటి కిషోర్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణకు మకాం



అన్ని దారుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఆ చెక్‌పోస్టుల వద్ద పోలీసులు, ఐసీడీఎస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు మకాం వేశారు. పట్టణంలోకి వచ్చే పెళ్లి బృందాలను పరిశీలించి మరీ పంపుతున్నారు. అంతేకాదు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. బాల్యవివాహాల నియంత్రణలో భాగంగా ఆ మేరకు పరిశీలనలు చేస్తున్నారు. నాలుగు మాడవీధులు జనంతో క్రిక్కిరిసిపోయాయి. ఆదిదేవుడి పెళ్లికి జనం తండోపతండాలుగా తరలి వచ్చారు. సాయంత్రం వరకు పలుచగా కనిపించిన వీధులు రాత్రికి జనంతో నిండిపోయాయి.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు




శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జరిగిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఉదయం 9గంటలకు పట్టణానికి చెందిన వేదశ్రీ నృత్య ప్రదర్శనతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం 9.30గంటలకు పట్టణానికి చెందిన మౌనిష, జానీషా నృత్య ప్రదర్శన అలరించింది. 10.30గంటలకు మదనపల్లికి చెందిన ప్రసన్నలక్ష్మి భక్తిరంజని జరిగింది. 12గంటలకు చక్రవరం రక్షిత సాయి కూచిపూడి నృత్య ప్రదర్శన, 12 గంటలకు మదనపల్లికి చెరందిన సరస్వతి, 1.30గంటలకు చంద్రగిరికి చెందిన కోమల, 2గంటలకు తిరుపతికి చెందిన తేజశ్వి, 4.30గంలకు మోక్షశ్రీ, 5.30 గంటలకు జగదీష్ భరతనాట్యం ఆకట్టుకుంది. రాత్రి 7గంటలకు పట్టణానికి చెందిన కవిత భక్తిరంజనీ జరిగింది. 8 గంటలకు కేరళకు చెందిన రేష్మి మీనన్ మోహిని యట్టం జరిగింది. 10గంటలకు నెల్లూరుకు చెందిన నందికేశ్వర కూచిపూడి కళాక్షేత్రం శరణ్యారెడ్డి నృత్య ప్రదర్శన జరిగింది. రాత్రి 1గంటలకు వెంకటగిరికి చెందిన రామ నాట్య మండలికి చెందిన నాగేశ్వరరావు ప్రదర్శించిన రామాంజనేయ యుద్ధం నాటకంతో శుక్రవారం నాటి సాంస్కృతిక కార్యక్రమాలు ముగిశాయి.

- శ్రీకాళహస్తీశ్వరాలయబ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం కల్యాణోత్సవం జరిగింది. ఈ సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేశారు. వారికి నాలుగు మాడవీధుల్లో కొంతమంది దాతలు భక్తులకు అన్నదానాలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.




చంద్రన్న బడ్జెట్‌లో పేదలకు బాసట


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు బాసటగా ఉందని టీడీపీ బీసీ విభాగం నాయకులు అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నాశనం చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి అటు రాబడి మార్గాలను సృష్టించుకుంటూ ఆర్థిక దుబారాను అదుపు చేస్తూ చంద్రబాబు నాయకత్వంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ బడుగు వర్గాల అభివృద్ధి సాధిస్తామన్నారు. బీసీల సంక్షేమానికి మునుపెన్నడూ లేని విధంగా 47,456 కోట్లు కేటాయింపు ఇవ్వడంపై ఏన్‌డీఏ ప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. ఇక సూపర్‌సిక్స్ పథకానికి అమలు కోసం తల్లికి వందనం కోసం రూ.9,407కోట్లు, దీపం పథకానికి రూ.2,601కోట్లు, సామాజిక భద్రతా పింఛన్ల కోసం రూ.27,518కోట్లు, అన్నదాత సుఖీభవకు 6,300కోట్లు కేటాయించడం సంతోషకరమన్నారు. ఈకార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమ, అభివృద్ధి డైరెక్టర్ మిన్నల రవి, నాయకుల ఉమేష్‌రావు, నెమళ్ళూరు బుజ్జి, మునిరాజాయాదవ్, కోట చంద్రశేఖర్, భాస్కర్, మణి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో శుక్రవారం పరీక్షా కేంద్రాలను డీఎస్పీ నరసింహమూర్తి తనిఖీ చేశారు. పట్టణంలోని ఎంజీఎం కళాశాల, ఎస్వీయే బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ఇక సమీపంలో జిరాక్సు కేంద్రాలు, కంప్యూటర్ సెంటర్లను మూసివేయాలని డీఎస్పీ చెప్పారు.

సర్వీసు రోడ్డు నిర్మించాలని రైతుల ఆందోళన


సాగరమాల రోడ్డు పనులను అడ్డుకొన్న రైతులు

నాయుడుపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట నర్సారెడ్డి కండ్రిగ వద్ద సాగరమాల రోడ్డు పనులను శుక్రవారం రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగరమాల రోడ్డు కోసం దాదాపు 300 ఎకరాలు ఇచ్చామన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేస్తామని అప్పట్లో అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. పుదూరు, విన్నమాల, పెరికిలంపాటి కండ్రిగ, మర్లపల్లి, అన్నమేడు, కాపులూరు, చిలమత్తూరు గ్రామాల్లో సాగరమాల రోడ్డుకు ఇరువైపులా రైతుల పొలాలు ఉన్నాయన్నారు. 13 అడుగుల ఎత్తులో రోడ్డు నిర్మిస్తుండడంతో రైతులు తమ పొలాల్లోకి రాకపోకలకు అవకాశం ఉండదన్నారు. భూసేకరణ సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం సర్వీసు రోడ్డు నిర్మాంచాలని రైతులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు జె.వెంకటకృష్ణారెడ్డి, నన్నారెడ్డి హరినాథరెడ్డి, ధనుంజయరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సునీల్, శివకుమార్, హమరేంద్రరెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

చిల్లకూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరు దళితవాడ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు... గూడూరు మండలం దివిపాళెం గ్రామానికి చెందిన సుజాత గూడూరు వైపు స్కూటర్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో సుజాతకు తీవ్ర గాయాలవడంతో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఇటుక బట్టీలకు విద్యుత్ కనెక్షన్ల తొలగింపు

కోట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కనెక్షన్ల పేరుతో విద్యుత్ కనెక్షన్లు తీసుకుని ఇటుక బట్టీలకు వినియోగిస్తున్న సర్వీసులను ఆ శాఖ అధికారులు తొలిగించారు. కోట మండలంలో వెంకన్నపాలెం, రంగన్నగుంట, తిమ్మానాయుడు పాలెం, వంజివాక, కొక్కుపాడు, సూరిశెట్టిపాలెం తదితర ప్రాంతాల్లో పెద్దసంఖ్యలో ఇటుక బట్టీలు ఉన్నాయి. కొంతమంది వ్యాపారులు వ్యవసాయ కనెక్షన్ల పేరుతో సర్వీసులు పొందారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకల బట్టీకు విద్యుత్ వినియోగిస్తుండడంతో ఆ శాఖ అధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు. 13 కనెక్షన్లను తొలిగించారు.

క్వారీకి భూముల అప్పగింతపై ప్రజాభిప్రాయ సేకరణ


కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్మయి, కాలుష్య నియంత్రణ అధికారి రాజశేఖర్

ఓజిలి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం భువనగిరిపాళెంలో ఏర్పాటైన్న సుజిత్ ఇన్‌ఫ్రా మెటల్ క్వారీకి అవసరమైన అదనపు భూముల అప్పగింత కోసం శుక్రవారం భువనగిరిపాళెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, తిరుపతి కాలుష్య నియంత్రణ బోర్డు ఈఈ రాజశేఖర్ పాల్గొని స్థానికులతో మాట్లాడారు. సర్వే నెంబరు 1లో ఉన్న రెండు హెక్టార్ల భూములను క్వారీకి అప్పగించేందుకు అభ్యంతరం లేదంటూ గ్రామస్తులు తెలిపారు. సమావేశంలో తహసీల్దారు పద్మావతి, నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు, ఓజిలి ఎస్ఐ స్వప్న, ఆర్ఐ విజయకుమార్, వీఆర్వో కస్తూరయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నుల వితరణ

ఓజిలి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం కురుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైన్స్ దినోత్సవం నిర్వహించారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, విశ్రాంత పారామెడికల్ అధికారి దార్ల అంకయ్య పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు వితరణగా అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మేకల శారదాదేవి, ఉపాధ్యాయులు రవి, రమణ, సుధాకర్, మాధవయ్య ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలయ్య పాల్గొన్నారు.

వైభవంగా నాగేశ్వరస్వామి గ్రామోత్సవం


గ్రామోత్సవంలో ఉత్సవ కమిటీ సభ్యుడు శ్రీహరిరెడ్డి, టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, రమేష్ తదితరులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని నాగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి విశేష పూజలు చేశారు. అనంతరం శివ, పార్వతుల ఉత్సవ విగ్రహా లను పుష్పాలతో అలంకరించి మండలపంలో కొలువుదీర్చారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.

అంగన్‌వాడీ కేంద్రాల ప్రాముఖ్యాన్ని వివరించాలి

కోట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిద్దవరం అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం సెక్టార్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు పంచాయతీలకు చెందిన అంగన్వాడీ వర్కర్లతో అంగన్‌వాడీ కేంద్రాల విశిష్టత, విద్యా బోధన, అందిస్తున్న పథకాలు, సమయపాలన, తదితర అంశాలపై వర్కర్లకు సూపర్‌వైజర్ కృష్ణమ్మ అవగాహన కల్పించారు.

పారిశుధ్య కార్మికుల నిరసన

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్‌ను రద్దు చేయొద్దంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుధ్య కార్మికులు ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఏవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, వెంకటరత్నం, చినబాబు, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సామగ్రి ధ్వంసం కేసులో నిందితుడికి జైలు

రేణిగుంట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో సామగ్రి ధ్వంసం చేసిన కేసులో నిందితుడికి న్యాయమూర్తి జైలు శిక్ష విధించారు. రేణిగుంట అర్బన్ పోలీసు స్టేషన్ పరిధిలోని తారకరామానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024లో దసరా సెలువుల్లో మూసివున్న పాఠశాలలో మద్యం మత్తులో దొంగతనం చేసేందుకు వచ్చిన శ్రీకాళహస్తికి చెందిన పఠాన్ గౌస్‌బాషా అక్కడున్న బీరువాలను, సామగ్రిని ధ్వంసం చేశాడు. దీంతో అప్పట్లో కేసు నమోదైంది. ఈక్రమంలో శుక్రవారం 1వ ఏజే సీజే న్యాయమూర్తి నిందితుడికి నాలుగు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని సీఐ శరత్‌చంద్ర తెలిపారు.

కోర్టుకు హాజరైన టీడీపీ నాయకులు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ యువనేత టీడీపీ గతంలో చేపటిన యువగళం పాదయాత్ర శ్రీకాళహస్తిలో జరిగిన సందర్భంగా అప్పటి వైసీపీ ప్రభుత్వం పలువురు టీడీపీ నాయకులపై కేసులు బనాయించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం టీడీపీ నాయకులు పట్టణంలోని కోర్టుకు హాజరయ్యారు. గత ప్రభుత్వం తమపై కేసులు బనాయించిందని, కోర్టుమీద గౌరవంతో వాయిదాకు హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయకుమార్, కంఠా రమేష్, భాస్కర్‌గౌడ్, ముని రాజాయాదవ్, అద్దంకి కిట్టు, రెడ్డివారి గురవారెడ్డి, దశరథాచారితో పాటు న్యాయవాది జైసారథి హాజరయ్యారు.

న్యాయసేవాధికార సంస్థ స్టాల్ ఏర్పాటు


కరపత్రాలను అందజేస్తున్న న్యాయవాదులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం స్వామిఅమ్మవార్ల కల్యాణం జరిగింది. శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఆదేశాలతో పట్టణంలోని సుపథ మండపం వద్ద బాల్యవివాహాలను నిర్మూలిద్దాం అనే అంశంతో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్టాల్ ఏర్పాటు చేశారు. భక్తులకు బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. న్యాయవాదులు రాజేశ్వరరావు, శ్రీరామ్, ప్రజ్ఞ, సునీత, రజనికుమర్, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కంటైనర్ స్వాధీనం


కడూరు రిజర్వు ఫారెస్టులో కంటైనర్ నుంచి పోసిన చెత్త

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడూరు రిజర్వు ఫారెస్టులో థర్మోకోల్‌ను పార బోస్తుండగా అటవీశాఖ అధికారులు కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నారు. పలు పరిశ్రమల నుంచి సేకరించిన థర్మోకోల్ సహా పర్యావరణానికి హాని కలిగించే వస్తువులను సందరు బర్నింగ్ సెంటర్లకు తరలించాల్సి ఉంది. అయితే డబ్బు ఆదా చేసుకోవచ్చనే ఆలోచనతో ఇలా అటవీప్రాంతంలో పార బోసేస్తున్నారు. గుర్తించిన అధికారులు శుక్రవారం కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

వేలం మళ్లీ వాయిదా: మండిపడ్డ దరఖాస్తుదారులు


పంచాయతీ అధికారులను నిలదీస్తున్న కాంట్రాక్టర్లు

రేణిగుంట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రేణిగుంట పంచాయతీలో దుకాణ సముదాయాలు, వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్, మార్కెట్, బస్టాండ్‌లో పార్కింగ్ వేలం మళ్లీ వాయిదా పడింది. దీంతో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కాంట్రాక్టర్లు పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఏడాది మార్చిలో వేలం నిర్వహించాల్సి ఉంది. అయితే ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా వేశారు. దీంతో ఈనెల 28న శుక్రవారం వేలం నిర్వహిస్తున్నట్టు దినపత్రికల్లో ప్రకటన ఇచ్చారు. అయితే అనివార్య కారణాలతో వేలం వాయిదా వేస్తున్నట్టు అధికారులు ప్రకటించడంతో కాంట్రాక్టర్లు మండిపడ్డారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మణి మాట్లాడుతూ... మరో పది రోజుల్లో వేలం నిర్వహిస్తామని తెలిపారు.

చీటీల పేరుతో రూ.2కోట్ల మోసం

● న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించిన బాధితులు


రేణిగుంట పోలీసు స్టేషన్ వద్ద బాధితులు

రేణిగుంట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): చీటీల పేరుతో రూ.2కోట్లు మోసం చేశారని పోలీసులను బాధితుఏలు ఆశ్రయించారు. తమకు న్యాయం చేయాలంటూ బాధితులు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని పాంచాలినగర్‌కు చెందిన ముని రాజమ్మ గత పదేళ్లుగా రేణిగుంట పట్టణంలో చీట్టీలను నిర్వహిస్తోంది. దాదాపు వంద మంది చీటీలు వేశారు. అయితే చీటీలు ఐదేళ్ల క్రితం పూర్తయినా ఇప్పటి వరకు తమకు చెల్లించాల్సిన డబ్బును ప్రతిసారీ తేదీలు చెబుతూ వాయిదా వేయడంపై బాధితులు మునిరాజమ్మను గట్టిగా నిలదీశారు. దీంతో ఆమె సదరు వ్యక్తులకు తనను బెదిరిస్తున్నారంటూ లాయర్ నోటీసులు పంపింది. దీంతో బాధితులు లబోదిబోమంటూ రేణిగుంట అర్బన్ పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయంపై గత ప్రభుత్వ హయాంలో స్పందనలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

అగస్త్యేశ్వరుడి సేవలో ఎమ్మెల్యే సుధీర్



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం రాత్రి తొట్టంబేడు మండలంలోని పెద్దకన్నలిలో కొలువై ఉన్న దుర్గా సమేత అగస్త్యేశ్వరుడిని ఎమ్మెల్యే సుధీర్ దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకులు ఆయనను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి జానారెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బొజ్జల రిషితారెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల మస్టర్ పరిశీలన

రేణిగుంట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పంచాయతీ పారిశుధ్య కార్మికుల మస్టర్‌ను జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి పరిశీలించారు. శుక్రవారం తెల్లవారు జామున 5 గంటలకు రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి పారిశుధ్య కార్మికులకు ప్రాంతాల వారీగా విధులు కేటాయిస్తున్న సమయంలో డీపీవో అక్కడికి చేరుకున్నారు. అనంతరం ఎల్లమ్మ గుడి వద్దనున్న ఎస్‌డబ్ల్యూపీసీ ప్లాంట్‌ను పరిశీలించారు. సర్పంచ్ నాగేశ్, పంచాయతీ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ శిరీష, కార్యదర్శి మణి తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బదిలీ

పిచ్చాటూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హమీద్ బదిలీ అయ్యారు. తిరుపతి రుయాలో జనరల్ సర్జరీ విభాగంలో పోస్టు గ్రాడ్యుయేట్ చదువులు నిమిత్తం హమీద్ వెళుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో తన బాధ్యతలను రెండో వైద్యాధికారి మునిచరిత్రకు అప్పగించారు.

శాస్త్రోక్తంగా పల్లికొండేశ్వరుడి త్రిశూల స్నానం

రావణ బ్రహ్మపై వాల్మీకేశ్వరుడి విహారం ● ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు




స్వామిఅమ్మవార్ల తిరువీధి ఉత్సవం ముందు చక్రత్తాళ్వార్లతో అర్చకులు - చక్రస్నానం - రావణ బ్రహ్మ వాహనంపై విహరిస్తున్న స్వామి

నాగలాపురం, ఫిబ్రవరి 28, (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆఖరి రోజైన శుక్రవారం త్రిశూల స్నానం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం ఆలయ ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుకుల్ ఆలయ ప్రదోష మండపంలో సర్వ మంగళాదేవి సమేత నటరాజస్వామి ఉత్సవ విగ్రహాలకు పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చందనం, పన్నీరులతో అభిషేకించారు. అనంతరం స్వామిఅమ్మవార్లకు ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. తద నంతరం వివిధ పుష్పాలతో, బంగారు ఆభరణాలతో, పట్టువస్త్రాలతో అలంకరించి మహా, నక్షత్ర, కుంభ హారతులు చేపట్టారు. స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో త్రిశూలం, చక్రత్తాళ్వార్లకు అభిషేకాలు చేసి ఆలయ ప్రధాన అర్చకులు స్థానికంగా ఏర్పాటు చేసిన తొట్టిలో శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు.

రావణ బ్రహ్మపై...

ఉత్సవాల్లో భాగంగా వాల్మీకేశ్వరుడు రావణ బ్రహ్మ వాహనంపై తిరువీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా సాయంత్రం స్వామి, అమ్మవార్లను సుందరంగా అలంకరించి రావణ బ్రహ్మ వాహనంపై అధిష్టింపజేసి మహా హారతి చేపట్టారు. అనంతరం మంగళ వాయిద్యాలు, కోలాటాలు, భజన బృందాలు, బాణసంచా పేలుళ్ల నడుమ తిరువీధి ఉత్సవం నిర్వహించారు. స్వామిఅమ్మవార్లకు భక్తులు అడుగడుగునా కొబ్బరికాయలు కొట్టి, కర్పూర నీరాజనాలు సమర్పించారు.

ధ్వజావరోహణం

సాయంత్రం 7 గంటలకు ఆలయ ధ్వజ స్తంభం వద్ద శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ధ్వజా అవరోహణం నిర్వహించి బ్రహ్మోత్సవాలను పరిసమాప్తి చేశారు. ఈ పూజలకు శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఉభయదారుగా వ్యవహరించారు. ఆలయ ఈవో లత ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దుమ్ము రేగుతున్న గిరిప్రదక్షిణ రోడ్డు


మట్టి, కంకర చిప్స్‌తో గిరిప్రదక్షిణ రోడ్డు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): గిరిప్రదక్షిణ రోడ్డులో దుమ్ము రేగడంతో భక్తుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి కైలాసగిరుల చుట్టూ గిరిప్రదక్షిణ రోడ్డు ఉన్న విషయం తెలిసిందే. ఏటా కనుమ రోజునా... అలాగే మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవం తరువాత శివపార్వతుల గిరిప్రదక్షిణ జరుగుతుంటాయి. కైలాసగిరికాలనీ నుంచి రాజీవ్‌నగర్ అక్కడి నుంచి రామాపురం రిజర్వాయర్ వద్ద ఉన్న అంజూరువారి మండపం వరకు సిమెంటురోడ్డు ఉంది. ఈ రోడ్డుపై ట్యాంకర్ల ద్వారా నీటితో తడపక పోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. స్వామిఅమ్మవార్ల గిరిప్రదక్షిణలో వేలాదిమంది భక్తులు పాదరక్షలు లేకుండా నడచి వెళ్తుంటారు. అలాంటివారు కాళ్లు కాలుతూ సాగాల్సి వస్తోంది. ఇక అంజూరు వారి మండపం నుంచి కిలోమీటరు వరకు తారరోడ్డు, అక్కడి నుంచి మళ్లీ రెండు కిలోమీటర్లు అంటే వెయ్యిలింగాల కోన వరకు సిమెంటు రోడ్డు ఉంది. ఇక్కడ వరకు కాళ్లు కాలే సమస్య భక్తులను వెంటాడుతోంది. ఇక వెయ్యిలింగాల కోన నుంచి ముక్కంటి ఆలయ సమీపం తుఫాన్ సెంటరు వరకు గతంలో మట్టిరోడ్డు ఉండేది. వర్షాలతో అది రాళ్లమయంగా మారింది. ఈ ఏడాది జనవరిలో జరిగిన గిరిప్రదక్షిణ వేడుకకు ముందే ఆ రోడ్డుపై కంకర దుమ్ము, సన్న చిప్స్‌తో చదును చేశారు. సన్నటి గుల్ల పాదాలకు గుచ్చుకుంటున్నాయి. అలాగే దుమ్ము, ధూళితో భక్తులు అసౌకర్యంగా సాగాల్సి వచ్చింది. ఆదివారం స్వామిఅమ్మవార్ల గిరిప్రదక్షిణ మహోత్సవం జరగనుంది. ఈ నేపథ్యంలో భక్తుల సౌకర్యం అధికారులు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ముక్కంటికి కాణిపాక ఆలయ పట్టువస్త్రాల సమర్పణ


పట్టువస్త్రాలు తీసుకొస్తున్న పెంచలకిషోర్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా కాణిపాకం ఆలయం తరఫున శుక్రవారం పట్టువస్త్రాలను సమర్పించారు. ముందుగా ఆలయ ఆవరణలోని మణికంఠేశ్వరస్వామి ఆలయంలో పట్టువస్త్రాలకు పూజలు చేశారు. అనంతరం వేదమంత్రాల నడుమ, మంగళవాయిద్యాలతో కాణిపాక ఆలయ పెంచలకిషోర్ ఊరేగింపుగా ఆలయంలోకి తీసుకువచ్చారు. అక్కడ ఆలయ అలంకార మండపంలో శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో బాపిరెడ్డికి అందజేశారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాణిపాక ఆలయ ఈవోను ముక్కంటి శేషవస్త్రంతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. టీడీపీ నాయకులు చెంచయ్యనాయుడు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ సైన్స్ దినోత్సవం



దిస్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ - అమరరాజా పాఠశాలలో జరిగిన క్విజ్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): దేశం అభివృద్ధి చెందాలంటే శాస్త్ర సాంకేతిక రంగాల్లో పురోగతి సాధించాల్సి ఉందని ఎంఈవో భువనేశ్వరి అన్నారు. అంతర్జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు తయారు చేసిన పలు నమూనాలను తిలకించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఏజీఎం సురేష్, మహిళ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు సాయి వందన తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని ది స్కూల్‌లో జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో కరస్పాండెంట్ జనార్దనరావు పవార్, ప్రధానోపాధ్యాయురాలు విశాల, విద్యార్థులు పాల్గొన్నారు. విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన మేళాలో కరస్పాండెంట్ శోభ, ప్రధానోపాధ్యాయులు డి.శ్రీధర్, అతిథులు చిలకా రంగయ్య తదితరులు పాల్గొన్నారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కూడా అంతర్జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు.

నారాయణవనం(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని డీవైఈవో ప్రభాకర్ రాజు పేర్కొన్నారు. మండలంలోని నారాయణవనం, పాలమంగళం జడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులను ప్రభాకర్‌రాజు తిలకించారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకంబాడిలో ఉన్న అమరరాజా పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. అలాగే విద్యార్థులు ప్రదర్శించిన సైన్సు నమూనాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం దేవీప్రియ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు

కేవీబీపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ జగదీష్ చెప్పారు. ఈ సందర్భంగా శుక్రవారం మండలంలోని బైరాజులకండ్రిగ, తిమ్మసముద్రంలో తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో వైద్యులు క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలను నిర్వహించారు. మహిళలకు రొమ్ము గర్భాశయ ముఖద్వార పరీక్షలను నిర్వహించారు. పురుషులకు నోటిక్యాన్సర్ పరీక్షలను చేశారు. డాక్టర్లు హరిత, చైతన్య, సర్పంచ్ గౌతమి, చెంచు ప్రకాష్‌యాదవ్, స్థానిక వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకులకు ఎమ్మెల్యే ఆదిమూలం నివాళి

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీకి సేవలందించిన మాజీ సర్పంచ్ వి.వెంకట కృష్ణయ్య మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. నాలుగు రోజుల క్రితం మృతి చెందిన వెంకటకృష్ణయ్య కుటుంబీకులను శుక్రవారం ఎమ్మెల్యే ఓదార్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కన్నయ్యనాయుడు, రవినాయుడు, మునిచంద్రనాయుడు, బి.గిరిష్ యాదవ్, భూపయ్య తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పంబట్టులో మృతి చెందిన టీడీపీ నాయకుడు గోపాల్‌రెడ్డి భౌతికకాయానికి ఎమ్మెల్యే ఆదిమూలం శుక్రవారం ఉదయం నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, అరణియార్ ఆయకట్ట చైర్మన్ రవిరెడ్డి, వాసురెడ్డి, బలరామ్, వేలాయుధం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ...

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలటూరుకు చెందిన టీడీపీ నాయకుడు శివకుమార్ అనారోగ్యంతో శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ఆస్పత్రికి చేరుకుని శివకుమార్‌ను పరామర్శించారు. త్వరగా కోలుకునేలా చికిత్సలు అందించాలని వైద్యులను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలి

ఏపీ వ్యవసాయ సంఘం

సత్యవేడు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ పరిధిలోని ఇరుగుళం, కొల్లడం, పెద్దఈటిపాకంలలో ఏపీఐఐసీ ద్వారా ప్రభుత్వం సేకరించనున్న భూములకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి జనార్దన్, ఉపాధ్యక్షుడు రమేష్ డిమాండ్ చేశారు. భూసేకరణ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిన ఇరుగుళం, కొల్లడం, పెద్దఈటిపాకం రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమను భయపెట్టి భూములు తీసుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

సింహవాహనంపై వెంకన్న వైభవం



శ్రీకాహహస్తి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండమానుపురంలో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న అభయ హస్త వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ఉదయం వేకువ జామున స్వామిఅమ్మవార్లను అర్చకులు సుప్రభాతసేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం అభిషేక పూజలు చేశారు. 11గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 5.30గంటలకు ఊంజల్ సేవ జరిగింది. రాత్రి సర్వాలంకార శోభితులైన స్వామిఅమ్మవార్లు సింహవాహనంపై ఆశీనులై గ్రామంలో ఊరేగారు.

కమనీయం శివపార్వతుల కల్యాణం

రేణిగుంట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): శివపార్వతుల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. శుక్రవారం ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలో భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో ఉదయం శివపార్వతుల కల్యాణం భక్తజనుల నడుమ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అమ్మవారి పసుపు, కుంకుమను పంపిణీ చేశారు. అలాగే రేణిగుంట మండలం అత్తూరులోని నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో స్వామిఅమ్మవార్ల కల్యాణం ఘనంగా నిర్వహించారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శివరాత్రి నిత్య ఉత్సవాల వివరాలు...

- ఉదయం 9 గంటలకు: శ్రీస్వామి అమ్మవార్ల నూతన దంపతుల ఆలయ ప్రవేశం, గోవత్స దర్శనం
- ఉదయం 9.00 - 10.30 వరకు: మూడు కాలాభిషేకాలు
- ఉదయం 11.00 స్వామిఅమ్మవార్ల పురవీధులు ఉత్సవం
- సాయంత్రం 5గంటలకు: ప్రదోష కాలాభిషేకం
- రాత్రి 7.00 సభాపతి కల్యాణ సంకల్పం, సభాపతి కల్యాణం, పురవీధుల ఉత్సవం
- రాత్రి 9.30 గంటలకు: దర్శనం ముగింపు